నిత్యజీవితంలో

భగవద్గీత



ఆచార్య శేషయ్య కందమూరు, Ph.D.

నిత్యజీవితంలో భగవద్గీత

ఆచార్య శేషయ్య కందమూరు
M.Com.,Ph.D.,
విశ్రాంత వాణిజ్య ఆచార్యులు
శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి

201, నారాయణ విహార్
నెహ్రూనగర్, తిరుపతి–517 507

First Edition : 2013

ACHARYA SESHAIAH KANDAMURU, M. Com., Ph.D.
KASHYAPA ACADEMY OF LEADERSHIP
201, Narayana Vihar, Nehru Nagar
Tirupati - 517 507
Phone : 0877-2240998, 98481 10196
e-mail : seshaiahk@yahoo.co.in

వెల : రూ. 60/-

Printed at
SVPCL Ltd.
Fathenagar
Hyderabad

గీతా సారం

జీవితం కోరికల సమాహారం

కోరికలు తీరవనే భయం, దుఃఖాన్ని కల్గిస్తుంది

తీరని కోరికలు, దుఃఖాన్ని ఇనుమడింపజేస్తాయి

తీరిన కోరికలు, కొంగ్రొత్త కోరికలతో దుఃఖాన్ని కల్పిస్తాయి

దుఃఖం శారీరక మానసిక రుగ్మతలకు, సంసారబంధనానికి కారణమౌతుంది

కోరికలను, భయాన్ని, దుఃఖాన్ని నాశనం చేయడానికి మానవుడు ధర్మయుద్ధం చేయాలి

భయాన్ని, దుఃఖాన్ని జయిస్తే మానవుడు ఇహలోకంలో జయానికి, సుఖానికి, ఆనందానికి అర్హుడవుతాడు

దుఃఖాన్ని జయిస్తే, మానవుడు జ్ఞానానికి, కర్మకు, భక్తికి, వైరాగ్యానికి అర్హుడవుతాడు

ధర్మయుద్ధం చేయడానికి, ఆత్మజ్ఞానం, నిష్కామకర్మ, పరమభక్తి, ధ్యానం, ధర్మం, యజ్ఞం, యోగం, త్యాగం, ఆయుధాలుగా ఉపయోగించాలి

ధర్మయుద్ధం ద్వారా తనలోని అంతర్ శత్రువులను, బాహ్య శత్రువులను జయించాలి

ధర్మయుద్ధంలో విజయం పొందినవారు గుణాతీతులై, ద్వంద్వాతీతులై, సంసారబంధం నుండి విముక్తులై, బ్రహ్మములో రమించి, మోక్షసిద్ధికి అర్హులౌతారు.

కృష్ణాష్టకమ్

1. వసుదేవసుతం దేవం కంసచాణూరమర్దనమ్ ।
దేవకీపరమానందం కృష్ణంవందే జగద్గురుమ్ ॥

2. అతసీపుష్పసంకాశం, హారనూపురశోభితమ్ ।
రత్నకంకణకేయూరం, కృష్ణంవందే జగద్గురుమ్ ॥

3. కుటిలాలకసంయుక్తం, పూర్ణచంద్రనిభాననమ్ ।
విలసత్కుండలధరం, కృష్ణంవందే జగద్గురుమ్ ॥

4. మందారగంధసంయుక్తం, చారుహాసం చతుర్భుజమ్ ।
బర్హిపింఛావచూడాంగం, కృష్ణంవందే జగద్గురుమ్ ॥

5. ఉత్ఫుల్లపద్మపత్రాక్షం, నీలజీమూతసన్నిభమ్ ।
యాదవానాం శిరోరత్నం, కృష్ణంవందే జగద్గురుమ్ ॥

6. రుక్మిణీకేళిసంయుక్తం, పీతాంబరసుశోభితమ్ ।
అవాప్తతులసీగంధం, కృష్ణంవందే జగద్గురుమ్ ॥

7. గోపికానాం కుచద్వంద్వకుంకుమాంకితవక్షసమ్ ।
శ్రీనికేతం మహేష్వాసం, కృష్ణంవందే జగద్గురుమ్ ॥

8. శ్రీ వత్సాంకం మహోరస్కం వనమాలావిరాజితమ్ ।
శంఖచక్రధరం దేవం, కృష్ణంవందే జగద్గురుమ్ ॥

కృష్ణాష్టకమిదం పుణ్యం ప్రాతరుత్థాయ యః పఠేత్ ।
కోటిజన్మకృతం పాపం, స్మరణేన వినశ్యతి ॥

॥ ఇతి శ్రీకృష్ణాష్టకం సంపూర్ణమ్ ॥

అర్పణం

కృష్ణం వందే జగద్గురుమ్

కలియుగంలో భయం సంశయం వలన

దుఃఖంతో తపించే మానవుడిని

రక్షించేందుకు, కర్మ భక్తి జ్ఞాన వైరాగ్యాలను

ఆయుధాలుగా ఉపయోగించుకునేట్టు చేసి,

మానవుడు జీవన సమరాన్ని సాగించి, ఇహపర

సుఖానంద మార్గాన్ని, సుగమం చేసిన

జగద్గురువు శ్రీకృష్ణపరమాత్మ

పాదపద్మములకు

సమర్పణం.

విజ్ఞప్తి

నేను భగవద్గీత మీద ఎలాంటి వ్యాసాలు వ్రాయలేదు. పెద్దగా ప్రసంగాలు చేయలేదు. నా "Fate and Free-Will" పుస్తకంలో ఒకటి రెండు సందర్భాలలో గీతాచార్యుని వాక్యాలను ఉదహరించడం మినహా గీతమీద ఎలాంటి సాధన చేయలేదన్న సత్యాన్ని చెప్పక పోతే, గీతమీద ఒక్క వాక్యాన్నైనా వ్రాయడానికి అర్హత వుండదని నా విశ్వాసం.

కాకతాళీయంగా శ్రీ ఎన్.రంగధామ్ గారు నిత్యజీవితంలో భగవద్గీత ప్రాశస్త్యం మీద సులభమైన భాషతో, భావంతో ఒక వ్యాసం రాస్తే బావుంటుందని వారు అన్నారు. వెంటనే అలాంటి ప్రయత్నం చేస్తే బావుంటుందనే ఆలోచన నా మనస్సుకు తోచింది.

నాకు పరిచయం ఉన్న కొద్దిమందితో గీతా సారాంశాన్ని గురించి ప్రస్తావిస్తే ఒక్కొక్కరు ఒక్కొక్క మంచి శ్లోకం చదివి అర్థాన్ని చెప్పారు. నాకు అది తృప్తి నీయకపోవడంతో నా వద్ద కొన్ని సంవత్సరాలుగా ఉన్న శ్రీ రావుల సూర్యనారాయణ మూర్తి, స్వామిని శారదా ప్రియానంద గీతా పుస్తకాల్లోని తాత్పర్య భాగాన్ని, నాకు సంస్కృతం పరిచయం లేనందున, చదవడం జరిగింది. తద్వారా నాలో మూడు వ్యాక్యాల్లో, మూడు నిమిషాల్లో, గీతా సారాన్ని నిత్యజీవితంలో ఉపయోగపడేట్టు అందించాలనే సంకల్పం కలిగిన వెంటనే శ్రీకృష్ణపరమాత్మ అనుగ్రహంతో ఈ క్రింది మూడు వాక్యాలు మనసుకు తోచాయి. దాని ఆధారంగా మిగతా పుస్తకం తయారు చేయడం జరిగినది.

మూడు వాక్యాలు :

1. ప్రతి జీవి కోరికలు, భయం, సంశయం కారణంగా, దుఃఖితుడు అవుతున్నాడు.

2. కోరికల, భయాల, సంశయాల ద్వారా జనించే దుఃఖాన్ని జయించాలంటే నిరతంరం ధర్మబద్ధమైన, యోగ సంహితమైన అంతర్బహిర్ యుద్ధాలు చెయ్యాలి.

3. అలాంటి యుద్ధాలను చేయడానికి కర్మ, భక్తి, జ్ఞాన, వైరాగ్య,

యజ్ఞాలను ఆయుధాలుగా చేసుకుంటే దుఃఖం నుండి బయట పడడమే కాక పరమాత్మ స్వరూపాన్ని తెలుసుకొని, బ్రహ్మజ్ఞానాన్ని పొంది పరబ్రహ్మంలో లయం కావడానికి సులభం అవుతుంది.

భగవద్గీత కర్మ, భక్తి, జ్ఞాన ప్రక్రియలను, 18 అధ్యాయాలలో వివరించడంలో, యోగాన్ని, జ్ఞానాన్ని, వైరాగ్యాన్ని, త్యాగాన్ని, యజ్ఞాన్ని, యాగాన్ని ఉపక్రియలుగా కలిపి పురి పెట్టబడ్డాయి. ఆకారణంగా అనేక వ్యాఖ్యానాలు బయట పడ్డాయి. అయితే కర్మలేని భక్తి జ్ఞానం, భక్తి లేని కర్మ జ్ఞానం, జ్ఞానం లేని కర్మ భక్తిని, విడదీయడం ఎవరి తరం కాదు. అదే విధంగా కర్త కర్మ క్రియలను కూడా విడదీయడానికి వీలుకావు. కాని వీటి విభజన, కలయిక అంతా, జడం చైతన్యం జీవుడు, భగవంతుడిని దాటి పోవడానికి వీలులేదు. ఇలాంటి సందిగ్ధం, క్లిష్టత అన్ని సిద్ధాంతాలలో చూస్తాం.

జడం చైతన్యం జీవుడు ప్రకృతి ఆత్మ పరమాత్మ, అన్ని సిద్ధాంతాలకు పునాదులే. కానీ వీటి కలయిక విభజనలు లేదా కూడిక తీసివేతలకు ఉపయోగించే తర్కంతోనే వైవిధ్యం ఏర్పడుతుంది.

ఆ వైవిధ్యం అనేక సిద్ధాంతాలుగా ఆవిష్కరించబడ్డాయి. ఆదిశంకరుని అద్వైతం, రామానుజుని విశిష్టాద్వైతం, మద్వాచార్యుల ద్వైతం, భాస్కరుని భేదాభేద వాదం, నింబార్కుని ద్వైతాద్వైత వాదం వల్లభాచార్యుల శుద్ధా ద్వైతం (పరిపుష్టి సిద్ధాంతం) కూడా విశ్వ చైతన్యాన్ని అర్థం చేసుకోడానికి చేసిన ప్రయత్నాలే. చివరకు బౌద్ధ, జైన చార్వాకాధి మత సిద్ధాంతాలు కూడా ఈ కోవకు చెందినవే.

ప్రస్తుత నవ నాగరిక సమాజంలో కావాల్సింది గతంలోని జ్ఞానుల సందేశాల నుండి, మనిషి మంచితనంతో, క్రమశిక్షణతో, తనను తాను ఉద్ధరించుకుని, ఇతరుల అభివృద్ధికి అడ్డం కాకుండా జీవితాన్ని గడిపే కర్మ, భక్తి, జ్ఞాన, యోగాలను అర్థం చేసుకొనడం పరమ ధర్మం. ఈ లక్ష్యంతో ఈ భగవద్గీత పుస్తకాన్ని వ్రాయడం జరిగింది. ఈ భగవంతుని సందేశాన్ని విపులీకరించడంలో నా లోకజ్ఞానాన్ని జోడించబడింది. దీనిలోని దోషాలన్నీ నావిగా, సుగుణాలు ఆ భగవంతుని ప్రసాదంగా పరిగణించాలని హృదయపూర్వక విజ్ఞప్తి.

కృతజ్ఞతలు

ఈ పుస్తకానికి మున్నుడి వ్రాయమని అడిగినంతనే సహృదయతతో అంగీకరించిన మంత్రి వరేణ్యులు, గౌరవనీయులు శ్రీ. సి. రామచంద్రయ్య గారికి శతాధిక ధన్యవాదములు.

చిన్ననాటి నుండి నాకు అన్నివిధాలా సహాయ సహకారాలను అందించే మా మిత్రులు ఆదాల సోదరులు, శ్రీ రాఘవ రెడ్డి, శ్రీ ప్రభాకర రెడ్డి, శ్రీ మురళీకృష్ణా రెడ్డి, గార్లకు నా హృదయపూర్వక కృతజ్ఞతాభి వందనములు.

నా కుటుంబ శ్రేయస్సును ఆకాక్షించి, ఆశీర్వదించి పద్మభూషణ్ యస్. ఆనందరాం ఐ.పి.ఎస్ వారికి హృదయపూర్వక నమస్సులు.

నా సహఉద్యోగి మిత్రుడు డా॥ యం.మునిరామి రెడ్డి,(తిరుపతి) నావ్యక్తిగత మిత్రులు శ్రీ. పి.వి.హెచ్.ప్రసాద్, శ్రీ. కాటేపల్లి విజయ కుమార్, శ్రీ. దేగల రామమూర్తి, శ్రీ. యల్. విజయకుమార్ శెట్టి (హైదరాబాద్) వారలకు నా ప్రేమపూర్వక ధన్యవాదములు.

నాకు నిరంతరం స్ఫూర్తినిచ్చే మా కుటుంబసభ్యులు, నా అన్నగారు శ్రీ. కె.శివనారాయణరావు, నా శ్రీమతి కె.పద్మావతి, నా మేనకోడలు కుమారి యం.గిరిజ, నా సోదరులు శ్రీ. నందనవనం ప్రభాకర్ రావు, శ్రీ. చెరుకుమూడి ప్రభాకరరావు, నా అల్లుళ్లు శ్రీ ఆర్.వి. రవికుమార్, శ్రీ యమ్.వి. ఉపేంద్రనాథ్, శ్రీ. పి. శ్రీనివాస్, నా బావమరదులు చిరంజీవులు యం.వి.శివప్రసాద్, యం.వి. శివసుబ్రమణ్యం, యం.వి.రాధాకృష్ణమూర్తి గార్లకు నా ప్రేమ పూర్వక కృతజ్ఞతలు.

తిరుపతి **ఆచార్య శేషయ్య కందమూరు**
18-6-2013

ప్రవేశిక

ఈ జగత్తులోని మానవజన్మ నేటిది కాదు. పూర్వ జన్మలలో చేసిన పాపపుణ్యాల రాసి వ్యక్తమై ఒక జీవిగా రూపాంతరం చెంది, కోరికలకు దాసుడై భయానికి వశుడై దుఃఖానికి సేవకుడై, సంసారం అనే లంపటలో మునిగితేలుతూ ఆశ నిరాశల మధ్య చిక్కుకుని ఆరాటపడుతాడన్నది శాస్త్రాల సారాంశం.

శ్రీమన్నారాయణుడు జీవులఎడ తన కృప, దయ, ఔదార్యాల కారణంగా వారిని ఉద్ధరించేందుకు ఎన్నో అవతారాలు ఎత్తాడు. అందులో పరిపూర్ణ అవతారంగా విలసిల్లే శ్రీకృష్ణావతారంలో మానవుని బాధలకు, రుగ్మతలకు, సమస్యలకు సమాధానంగా ఒక సాధనా సంపత్తిని అందించ డానికి తన ప్రియశిష్యుడైన అర్జునుని ఎంచుకొని ఆయన ద్వారా ఒక మహాసందేశం భగవద్గీతరూపంలో అందించబడింది. భగవద్గీత మీద అనేక అనువాదాలు, వ్యాఖ్యానాలతో లెక్కలేనన్ని గ్రంథాలు వందల సంవత్సరాలుగా వెలుగుచూస్తున్నాయి. అయితే డా।। కె. శేషయ్య గీతాసారాన్ని ఒక క్రొత్త కోణం నుండి స్పృశించడం ఈ చిన్ని పుస్తకం యొక్క ప్రత్యేకత. మానవుని సమస్యలు, కోరికల వలన కలిగే భయం దుఃఖం, అని వివరించబడింది. ఈ సమస్యలకు సమాధానంగా, యుద్ధం ధర్మం యోగాలను, ప్రతిపాదించ బడ్డాయి. ఈ సమాధానాలను సాధనాలుగా మార్చడానికి, కర్మ, భక్తి, జ్ఞాన, వైరాగ్య, యజ్ఞ, యాగ, హోమ, త్యాగాలను అనుసరించాలని చెప్పడం వలన సామాన్య మానువుడికి భగవద్గీతా సారం సులభరీతిలో అర్థ మౌతుందనిపిస్తుంది. ఈ చిన్నిపుస్తకంలో గీతాసారాన్ని విశదీకరించడానికి ఆ శ్రీకృష్ణపర మాత్ముడి అనుగ్రహం కారణమని రచయిత చెప్పుకోవడం సత్యదూరం కాదనిపిస్తుంది.

– సి. రామచంద్రయ్య
దేవాదాయ, ధర్మాదాయ శాఖామాత్యులు

హైదరాబాద్
18-6-2013

విషయసూచిక

ప్రథమ అధ్యాయం

ఉపోద్ఘాతం

ధర్మ క్షేత్రే కురు క్షేత్రే
సమవేతా యుయుత్సవః ।
మామకాః పాండవాశ్చైవ
కిమకుర్వత సంజయ! ॥ (1.1)

మానవ జీవితం ఒక ప్రయాణం, పరిణామం. ఈ ప్రయాణం, పరిణామం, శరీరము మనస్సు ఆత్మ ద్వారా జరుగుతుంటుంది. ఈ పరిణామక్రమంలో మానవునికి పుట్టుక, పెరుగుదల నశింపు ఉంటాయి. ఈ పరిణామ క్రమమునకు సాధనము జీవించాలనే కోరిక. శరీరము శారీరక శక్తిని, మనస్సు మానసికి శక్తిని, ఆత్మ వాసనా శక్తిని విడుదల చేసి తద్వారా అనేక జీవన ప్రక్రియలకు ఆధారభూతమౌతుంటాయి.

జీవితమంటే ఒక కాల ప్రమాణం. కర్మేంద్రియాలుతో కర్మచేయడం, జ్ఞానేంద్రియాలతో జ్ఞానాన్ని సంపాదించడం కూడా కర్మచేయడమే. ఇవన్నీ ఒక ఎత్తు అయితే అసలు జీవితం "స్పృహ"తో ముడివడి ఉంటుంది. ఈ స్పృహలను శారీరక స్పృహ, మానసిక స్పృహ, ఆత్మ స్పృహలుగా విభజించవచ్చు.

ఈ స్పృహ, ప్రక్రియల్లో స్ఫుటంగా కనపడుతూ, ప్రముఖ పాత్ర పోషించేవి, కోరిక, ఘర్షణ, సంద్దిగ్ధం. కోరికలు తీరకపోతే, ఘర్షణకు లోనయితే, సంద్దిగ్ధం బాధిస్తే, మిగిలేది దుఃఖం, విషాదం, వేదన. అలాంటి దుఖాన్ని సమూలంగా నాశనం చేయడానికి ప్రతిమానవుడు శరీరం మీద, మనస్సు మీద, ఇంద్రియాల ద్వారా, యుద్ధం ప్రకటించి,

గెలుపు ఓటములను అనుభవిస్తుంటాడు. అయితే ఈ యుద్ధం ఒకటిగా ఉండదు. నిరంతరం అనేకరకాలైన యుద్ధాలు చేయవలసి ఉంటుంది. ప్రతి కోరిక పరోక్షంగా ఒక యుద్ధానికి కారణమౌతుంది. తీరని కోరికవలన పుట్టిన భయం యుద్ధాన్ని తయారుచేస్తుంది. ప్రతి సంఘటన ఒక యుద్ధాన్ని ప్రేరేపిస్తుంది.

సాధారణంగా యుద్ధభూమిలో రాత్రులు యుద్ధంచేయ కూడదనే నియమం ఉంటుంది. కాని ఈ జీవన యుద్ధభూమిలో అలాంటి నియమం పనిచేయదు. ఈ యుద్ధభూమిలో కోరికలు, భయాలు, వేదనలు, ఆశలు, ఆవేశాలు, ఆవేదనలు, విషాదాలు అనబడే అనేక మంది యోధులతో నిద్రలో కూడా యుద్ధం చేయవలసి యుంటుంది. యుద్ధంలో ఎన్నో జయాపజయాలు, ఎన్నో గాయాలు, బాధలు కలుగుతాయి. అన్నింటిని సహించి, జయాలను ఆనందాలను అందుబాటులోకి తెచ్చుకోవాలంటే, కర్మయోగంతో భక్తియోగంతో జ్ఞానయోగంతో ధ్యానయోగంతో, ఇతర ధర్మ, యజ్ఞ, హెూమ, జప, తప, జ్ఞాన, ధ్యాన, త్యాగ కార్యకలాపాలతో యుద్ధంచేయవలసి ఉ ంటుంది. దీనికి ముఖ్యంగా జగద్గురువైన శ్రీకృష్ణపరమాత్మను నమ్ముకొని తనను తాను అర్పణ చేసుకొని, శరణు జొచ్చితే మిగిలేది, తగిలేది, పొందేది, ఉండేది మోక్షం.

నిత్యజీవితంలో చాలామంది సందేహాలతో సమస్యలతో సతమతమై జవాబులు సంతృప్తిపరచక జీవితాన్ని నరక ప్రాయం చేసుకుని తనచుట్టూ ఉన్నవారికి నరకాన్ని సృష్టించి చివరకు హత్యలకు, ఆత్మహత్యలకు దారితీసే విధంగా జరుగుతున్న వైనం అందరికి తెలిసినదే.

సంసారం

మానవజీవి ఈ ప్రపంచంలో ఉద్భవించడమంటే సంసారంలోకి అడుగిడడమని అర్థం. జీవి తనకు తానుగా ప్రత్యేక రూపంలో, రంగులో,

ప్రవర్తనను సంతరించుకున్నప్పటికీ తాను మిగతా జీవ, జీవేతరాల లాగానే పంచభూతాల సమాహారమే. అనగా ప్రతి జీవి తనలోని పంచేంద్రియాల ద్వారా తన వెలుపలి పంచభూతాలతో, జీవులతో, పదార్థములతో, వస్తువులతో సంబంధం కలిగివుంటుంది. ఈ సంబంధ ముల ద్వారా జరిగే చర్యల ప్రతి చర్యల, స్పందనల ప్రతిస్పందనల, కలయికల విభజనల వలయం సంసారం.

జీవులు శరీరానికి ఆహారమనే పదార్థాన్ని అందించడం ద్వారా వచ్చే శక్తిని మనస్సుకు ఆలోచనలు, సంధిగ్దాలు, సమస్యలు అనే ప్రక్రియలకు వెచ్చిస్తారు. తద్వారా తమను గురించి ఇతరులను, బయటి ప్రపంచాన్ని అర్థంచేసుకోడానికి ప్రయత్నాలు జరుగుతుంటాయి.

ప్రతివ్యక్తికి ఒక శరీరము, మనస్సు ఆత్మ ఉంటాయి. ఒక రకం జీవులు శరీరంతో మనస్సుతో, విశ్వచైతన్యాన్ని అర్ధంచేసు కొని, వ్యక్తిగత చైతన్యాన్ని విశ్వచైతన్యంతో మిళితం చేసి రమించాలని తపనపడి, తాపత్రయంతో పయత్నం చేస్తుంటారు. వీరిని సాత్వికులు అంటారు.

రెండవ తరం జీవులు శరీరం, దానితో కూడిన మనస్సు, దాని సంబంధించిన కోరికలు, ఆశలు, ఆశయాలు, ఆవేశాలు, ఆనందాలు, అభినివేశాలు కలిపి, మనస్సుతో ఎక్కువ కాలాన్ని, శక్తిని, పనికి కేటాయించి ఉత్సాహంతో జీవితాన్ని గడుపుతారు. అంటే వీళ్ళు తమ శక్తియుక్తులను, నైపుణ్యాన్ని తన లోపలి, వెలుపల శరీరాన్ని ఈ ప్రపంచం యొక్క పుట్టుక, పెరుగుదల, ఉచ్ఛస్థితి, దిగజారడం, నశించడం లాంటి చర్యలకు వెచ్చిస్తారు. వీరిని, జ్ఞానుల, పండితుల, రజోగుణ సంపన్నుల, నాయకుల, శాస్త్రజ్ఞుల జాబితాలో చేరుస్తారు. వీరివల్ల ప్రపంచంలో అనేక వ్యాపార, వ్యవహార, కార్యక్రమములు జరుగుతుంటాయి.

దీనిద్వారా శారీరక మానసిక కోరికలు రెండూ, సంతృప్తి చెందే అవకాశం వస్తుంది.

మూడవ రకం వ్యక్తులలో శారీరక కార్యక్రమములు అధికమై కాలాన్ని, శక్తిని ఎక్కువ భాగము వినియోగించి, ఇంద్రియాలను తృప్తిపరచడంలో నిమగ్నమై, సంసారం అనే లంపటలో ఇరుక్కుని జీవితాన్ని వెళ్ళబుచ్చు తుంటారు. వీరు ఒకరకంగా చెప్పాలంటే జడులు. తమోగుణ స్వభావులు. వారికి ఇతర ప్రపంచంతో ఎక్కువ సంబంధం ఉండదు. వాళ్ళమనస్సు వారి చుట్టూ పరిభ్రమిస్తూ వుంటుంది. పుట్టడం, ఇంద్రియ సుఖాలతో సతమతమవడం, వాటిని తీర్చుకోవడం, త్వరత్వరగా జీవితాన్ని పూర్తిచేసుకోవడం, వారి జీవన స్రవంతి. వారి కాలం, శక్తి, పని అంతా శరీరం దాని అవసరాలు తీర్చుకోడం కొరకు బయటి ప్రపంచంలోని వ్యక్తుల, వస్తువుల, పదార్థముల, సంఘటనలకు పరిమితమవుతుంది. వీరిని తమోగుణులని నిర్ధారించారు.

కర్తవ్య నిర్వహణలలో తమ తమ గుణ గణాలను అర్థం చేసుకుని ఇతర అనుకరణాలను దూరంగా ఉంచి తన స్వధర్మాన్ని అనుసరిస్తే మిగిలేది మోక్షమే అన్నది తెలుసుకోవడం జ్ఞానం.

ప్రతి మానవుడు ఒక సైనికుడు. తన జీవితాన్ని అంటే క్షేత్రాన్ని రక్షించుకోవడం ఆ సైనికుడి స్వధర్మం. సైనికుడు అప్రమత్తంగా లేకపోతే అజ్ఞానం, అహంకారం, దురాశ, అసూయ, కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యల్లాంటి శత్రువులు దాడిచేసి ధర్మాన్ని విస్మరించేట్టు, త్యాగాన్ని త్యజించేట్టు చేసి, మోక్షానికి అనర్హునిగా చేస్తాయి. అందుచేత కర్మ ధర్మాన్ని అర్జునునిలా భావితరాల్లో జీవులందరిచేత జరిపించే సత్సంకల్పంతో శ్రీకృష్ణుడు అర్జునునికి మంచికి చెడుకు, శాశ్వతానికి అశాశ్వతానికి, ధర్మానికి అధర్మానికి మధ్య గీతను గీచి ద్వైతం చేసి మరలా అద్వైతంగా మలిచాడు.

ద్వంద్వాలు

జీవితం ప్రతివానికి ద్వంద్వాలతో మిళితమైన ఒక పెద్ద ప్రశ్నార్థకం. ద్వంద్వాలతో మిళితమై ఒకదాన్ని పొందాలంటే మరొక దాన్ని నుంచి తప్పించుకోవటం సాధ్యం కాదు అనిపిస్తుంది. ఉదా॥ సుఖం కావాలంటే దుఃఖాన్ని స్వీకరించాలి. వెలుగు కావాలంటే నిప్పును పట్టుకోవాలి. మంచిని పెంచుకోవాలంటే చెడ్డను జయించాలి. దైవత్వాన్ని పొందాలంటే రాక్షసత్వాన్ని నిర్మూలించాలి.

మానవేతర జీవుల్లో సంపన్నులు నిరుపేదలు, బుద్ధిమంతులు మూర్ఖులు, పొడుగువారు పొట్టివారు, తెల్లటివారు నల్లటివారు, జ్ఞానులు అజ్ఞానులు, దేవతలు రాక్షసులు, మంచివారు చెడ్డవారు, తెలివిగలవారు పిచ్చివారు లాంటి భేదాలు ఉండవు. జీవనచక్రంలో తమ ధర్మాన్ని నిర్వర్తిస్తాయి. అయితే ఇలాంటి భేదాలు, ద్వంద్వాలు మానవుల్లో పుట్టినది లగాయితు గిట్టేంత వరకు జీవితాన్ని శాసించడమే కాకుండా, జీవితంలో కలిగే అన్ని రకాల బాధలకు, ఆనందాలకు, సందేహాలకు, సమస్యలకు మూలాలుగా ఆవిష్కరింపబడుతాయి.

పుట్టిన ప్రతివ్యక్తి (ఏ పిచ్చివాడో, అమాయకుడో ఇంద్రియ బలహీనుడో మినహా) తాను ఈ ప్రపంచంలో అందరికంటే అందగాడిగా ఉండాలని, సంపన్నుడిగా ఉండాలని, శాసనకర్త కావాలని, జరామరణములకు అతీతంగా ఉండాలని ఆశిస్తాడు. కాని ఎవరూ జీవితాంతం ఒకేరకంగా ఉండరు. చిన్నతనంలో సుఖించిన వాడు వయస్సు మీరిన తర్వాత కష్టాలకు లోనుకావచ్చు. లేదా చిన్నప్పుడు కష్టపడి ఆ తర్వాత సుఖపడవచ్చు. ప్రతివాడి జీవితం నిరంతరం ఒక మార్పుకు లోనవుతుంటుంది. అనంత జీవన ప్రవాహంలో ఎన్నో అయోమయాలు, అలసటలు, ఆవేదనలు, అదృష్టాలు దురదృష్టాలు,

గెలుపు ఓటములు, సహజాలు. అయినప్పటికీ, ఏవి? ఎప్పుడు? ఎలా? ఎందుకు? జరుగుతాయి అన్నది ఒక పెద్ద చిక్కుప్రశ్న. ఈ ప్రశ్నకు జవాబు కొరకు ఎన్నో తర్క వితర్కాలు ఆవిష్కరింపబడి చివరకు ఇది ఒక అద్వితీయమైన అనంతమైన, మానవ మస్తిష్కానికి అందని శక్తి 'భగవంతుడు' అని నామకరణం చేసి, ఇవంతా ఆయనచే గీయబడిన గీత(లు) అని అర్థంచేసుకుని సంతృప్తిచెందారు.

మానవేతర జీవులలో ద్వంద్వాలు ఉండవు. కాని మానవుని పట్టి పీడించేది, పరిభ్రమింపజేసేది, పరిణామ క్రమంలో చోటుచేసుకునే ముఖ్యమైన అంశాలు ద్వంద్వాలు. ఈ ద్వంద్వాలు అన్నిరకాల భేదాలను సృష్టిస్తాయి. అందుచేత మానవులకు ఉన్నన్ని ద్వంద్వాలు, సందేహాలు, సమస్యలు మరే జీవికి ఉండవన్నది నిత్యసత్యం. అందుచేత మానవులకు కర్మ ఖర్మ, కర్మ అకర్మ, మంచి చెడు, సంపద దారిద్ర్యం, సంతోషం దుఃఖం లాంటి ద్వంద్వాలకు కట్టుబడి నిరంతరం జిజ్ఞాసతో సందిగ్ధంలోపడి చేయవలసినది చెయ్యలేక, ఏది చెయ్యాలనో తెలియక, జీవితంలోని అర్థాన్ని పరమార్థాన్ని తెలుసుకోలేక, దుఃఖాన్ని సొంతం చేసుకుని, కోరికల నుండి నివృత్తి పొందలేక నిర్యాణము, మోక్షము కొరకు ఏ ధర్మాన్ని పాటించాలో తెలియక, నిరంతరం సతమతమవుతూ ఉండడం సహజం. కాని మానవేతర జీవులకు బాధ, సౌఖ్యం ఉంటాయి కాని, దుఃఖముతో ఆనందముతో, మానవుడిలా వెంపరలాడవు. పైపెచ్చు బాధను కొని తెచ్చుకోవు, ఆనందం కోసం అర్రులు చాచవు. జీవితాన్ని జీవితంగా, కష్టాన్ని కష్టంగా, సుఖాన్ని సుఖంగా మరి దేనితో రాజీపడకుండా, జీవితం నుండి సన్యసించకుండా, కర్మను అనుభవిస్తూ లయబద్ధంగా జీవన ప్రయాణం సాగించడం వీటి ప్రత్యేకత.

అర్జునుడికి యుద్ధభూమిలో యుద్ధం చెయ్యడమా, మానడమా అన్న సమస్య, సందేహం, సందిగ్ధం తలెత్తింది. దానికి జవాబుగా శ్రీకృష్ణుడు 17 అధ్యాయాల సారాంశం – యుద్ధం ఎందుకు చెయ్యాలి? యుద్ధం ఎందుకు చేయకుండా ఉండకూడదు అని చెప్పడం, ద్వంద్వస్థితిని, ద్వంద్వాతీతస్థితిని రాబోయే తరాల జీవులకు సందేహం వచ్చినపుడల్లా సంక్లిష్టత నుండి బయట పడేందుకు ఒకమార్గాన్ని చూపించడమే.

గీతా స్వరూపం

గీత బిందువుల సమాహారం. గీత అద్వైతం. గీత ద్వైతాన్ని విభజన చేసే సూచిక. గీత విశిష్టాద్వైతాన్ని మిళితం చేసే సాధనం. గీత మంచిని చెడును, యుద్ధాన్ని శాంతిని, దుఃఖాన్ని ఆనందాన్ని, జాగృతిని సమాధిని, జనన మరణాలను, కోరికలను త్యాగాన్ని, మాటను మౌనాన్ని, ఆలోచనను నిశ్శబ్దతను, కర్తవ్యాన్ని అకర్తవ్యాన్ని, కర్మను అకర్మను, ధర్మాన్ని అధర్మాన్ని, న్యాయాన్ని అన్యాయాన్ని, దైవత్వాన్ని రాక్షసత్వాన్ని, విభజించి మిళితం చేసే ప్రక్రియను ఆచరణ యోగ్యమైన రీతిలో సామాన్యుడి నుండి మహత్ముని వరకు అర్థమయ్యే రీతిలో, ఉపమాన ఉపమేయాలతో, గేయంగా, గీతంగా, చిత్రీకరించబడి, గానం చేయబడినది.

ఈ గీత ఒక జీవన గీత. జీవి ఆశలను, ఆశయాలను తీర్చిదిద్దుకోవడానికి అందించిన దిక్సూచి ఈ గీత. 'గీత' మీదనే నడిచిన మానవుడు లక్ష్యానికి చేరుకుంటాడు. నిత్యజీవితంలో ప్రతిక్షణం ఉచ్ఛ్వాస నిశ్వాస ఊపిరి ధారలతో అంటి పెట్టుకుని ఉండేది గీత. ఎవరైనా తన తలరాతను మార్చుకోడానికి ఆచరణయోగ్యమైనది గీత. యుద్ధంతో ప్రారంభమై, కోరికల ఫలాలను అందించి, సంసారలంపటలో జీవితాన్ని

ముంచ కుండా, భ్రాంతిని అంతరింపజేసేది గీత. మోక్షపదానికి మార్గం చూపేది గీత.

మానవ జీవితంలోనికి దశదిశా నిర్దేశానికి మూలం 'జ్ఞానం'. జీవిత గమ్యాన్ని చేరుకోవడానికి సాధనం కర్మ. మానవుడు జ్ఞానంచేత కర్మ ద్వారా వైరాగ్యాన్ని అభ్యసించి మోక్షానికి అర్హతను సంపాదించగలడని విజ్ఞులు అనేక కోణాల్లో స్పృశించి వివిధ సిద్ధాంతాలను ఆవిష్కరించారు. నిత్యజీవితంలో భగవద్గీత నుండి తెలుసుకుని అనుసరించవలసిన విధి విధానాల సారాంశం కూడా ఇదే. ప్రతి జీవి పుట్టుకతోనే భయానికి, దుఃఖానికి వశుడై, ఆ కారణంగా నిర్వీర్యుడై, నిస్తేజుడవుతాడు. కాని జ్ఞానవంతుడు వాటిలో నుండి బయట పడే మార్గాలను వెదుక్కొని కర్మ జ్ఞానాలను ఆయుధాలుగా చేసుకుని క్షణం క్షణం జీవిత యుద్ధ భూమిలో శత్రువులను జయించే వీరుడవు తాడు. అది చేతకానివాడు దుఃఖానికి భయానికి లోనై కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలను ఆసరాగా చేసుకొని పుట్టుక, చావు, **"పునరపి జననం, పునరపి మరణం"** అనే సంసార చక్రంలో పడి జీవితాన్ని గడుపుతాడు.

శ్రీమద్భగవద్గీతలో శ్రీకృష్ణుడు మొదటి అధ్యాయానికి అర్జున విషాదయోగంతో శ్రీకారం చుట్టాడు. భగవద్గీత విషాదంతో మొదలై 18వ అధ్యాయంలో మోక్షానికి తలుపులు తెరచింది. గీతలోని మొదటి అధ్యాయం "అర్జున విషాదయోగం". అది ఒక ప్రశ్న అయితే, రెండవ అధ్యాయం "సాంఖ్య యోగం" దానికి జవాబు అవుతుంది. అర్జునుని అధైర్యం, మనోదౌర్భల్యం, అర్జునుడిని భీరువుగా చేస్తే, కన్నీరు కారుస్తూ విరక్తి భావాన్ని వ్యక్తం చేసినపుడు, శ్రీకృష్ణుడు రెండవ అధ్యాయంలో 11వ శ్లోకంలో ఒక జవాబు చెప్పాడు. ఈ శ్లోకం మొత్తం భగవద్గీతకు

మకుటాయమానం. ఈ ఒక్క శ్లోకంలోని అంతరార్థాన్ని సరిగ్గా తరచి చూస్తే భగవద్గీత, ఈ ఒక్క శ్లోకానికి వివరణ అని అనిపిస్తుంది.

శ్లో॥ అశోచ్యా నన్వశోచస్త్వం
ప్రజ్ఞావాదాంశ్చ భాషసే,
గతాసూ నగతా సూంశ్చ
నానుశోచంతి పండితాః ॥ (2.11)

ఈ శ్లోక తాత్పర్యం "అర్జునా! దుఃఖించనవసరం లేని వాళ్ళకోసం దుఃఖిస్తున్నావు. పైగా మహా వివేకిలాగా మాట్లాడుతున్నావు. చచ్చిపోయిన వాళ్ళ గురించి కాని, బ్రతికి ఉన్న వాళ్ళ గురించికాని వివేకులు శోకించరు"

పై శ్లోకం (2.11) భగవద్గీతకు శంకుస్థాపన అయితే మిగిలిన శ్లోకాలు స్తంభాలుగా నిలబడతాయి. భగవద్గీతలో ఉదహరించిన భయం, విషాదం, శోకం, ధర్మం, అర్థం, కామం, మోక్షం, జ్ఞానం, వైరాగ్యాన్ని జనింపజేస్తాయి. యోగం, యజ్ఞం, యాగం, త్యాగం, రామాయణ, భారత, భాగవతాల్లో, అష్టాదశ పురాణాల్లో అనేక కోణాల నుండి స్పృశించబడ్డాయి. అయితే గీతాతత్త్వం జీవంలోని జడాన్ని, జడంలోని జీవాన్ని విభజించడం మరలా ఏకం చేయడం, జీవిత అర్థాన్ని, అంతరార్థాన్ని, అనుభవాన్ని ఒక సమాహారంగా తీర్చిదిద్దడం భగద్గీతలో సశాస్త్రీయంగా జరిగిందనడానికి సందేహం లేదు.

ఈ శ్లోకం ద్వారా శ్రీకృష్ణుడు ఈ ప్రపంచం ద్వంద్వ మయమని, విజ్ఞుడు ద్వంద్వాతీత స్థితిని చేరవలెనని అదే అద్వైతానికి నాంది అని వచించాడు. గీతలో భయం, విషాదం, యుద్ధం విశిష్టాద్వైతం. ద్వంద్వాలు ద్వైతం. మోక్షం అద్వైతం. అనగా దుఃఖించ తగని వారు దుఃఖించతగిన వారు, వివేకులు అవివేకులు, చనిపోయిన వారు బ్రతికి ఉన్నవారు లాంటి ద్వంద్వాలు మిగతా అన్ని ద్వంద్వాలకు ఉదాహరణగా నిలచి

ద్వంద్వాతీతమైన కర్మ, జ్ఞానం, వైరాగ్య, భక్తి తత్వాలు మోక్ష సాధనములు అవుతాయని ప్రస్తావన చేయబడింది.

జీవితంలో ఈ ద్వంద్వం ఆయువు పట్టు. ఉదాహరణకు దుఃఖించ తగనిది తగినది, చెప్పతగినది చెప్ప తగనిది, తినతగినది తిన తగనిది, చేయతగినది చేయతగనిది, వినతగినది వినతగనిది, నేర్చుకో తగినది నేర్చుకో తగనిది, పరిత్యజించతగినది పరిత్యజించతగనిదిగా గతం భవిష్యత్తు, ఉన్నది లేనిది, నిత్యం అనిత్యం, లాభనష్టాలు, జయాపజయాలు, ధర్మాధర్మాలు లాంటి ద్వంద్వాలను రెండు వైపులకు నెట్టి మధ్యలో లక్ష్మణ రేఖలాంటి గీతను గీచి మానవుని ఆలోచనలు, మాటలు, చేతలు, ప్రవర్తనలను కర్మ జ్ఞానంతో ముడివేసి అన్ని వేళలలో, అన్ని కాలాలలో, ధర్మాధర్మాన్ని విడదీయడం గీతాచార్యుని లక్ష్యం.

అర్జునునికి యుద్ధభూమిలో ఒకసారి అనుభవించిన సంఘటన నిత్యజీవితంలో అందరికీ సర్వసాధారణం. అందుకే భగవద్గీత ఎవరు? ఎవరితో? ఎప్పుడు? ఎక్కడ? ఎలా? ఏమి? చేయవలనో నిర్ధారించి, వ్యక్తికీ, సమాజానికి ఒక దిక్సూచిలా పని చేయుగల తత్వాన్ని అందించినందు వలన, ఈనాటకీ భగవద్గీతలోని విషయాలను ఎంతమంది ఎన్నిరకాలుగా చెప్పినా, సముద్రంలోని నీళ్ళంటినీ బిందెలతో, కడవలతో తోడి సముద్రాన్ని ఖాళీచేసే ప్రయత్నాలుగా మిగిలి పోతున్నాయి.

గీతా రహస్యం

మానవుని ఎదుట ఉన్న సమస్యలు మూడు:

1. శరీరాన్ని మనస్సును కర్మకు వదిలేసి సంసార లంపటతో జీవితాన్ని గడపడమా.

2. శరీరాన్ని, మనస్సును, తన ఆధీనంలో ఉంచుకునే యుద్ధంచేసి, నిష్కామ కర్మను ఆచరించే జ్ఞానాన్ని సముపార్జించుకొని, వైరాగ్యాన్ని అభ్యాసం చేసుకుని, మాయను ఛేదించి బ్రహ్మాన్ని దర్శించడమా.

3. దైవీ సంపదతో జీవిత గమ్యాన్ని చేరడమా లేక అసుర సంపదతో జీవితాన్ని గడపడమా.

ఈ దైవీ సంపదతో నిష్కామకర్మను ప్రతివాడు కొద్దో గొప్పో అభ్యాసంచేస్తూ ఉంటాడు. దీన్ని పూర్తిగా ఆచరించినవాడు ఉత్తముడని శుద్ధ సత్వం ఎరిగిన వాడని అంటారు. దీన్ని తక్కువ డిగ్రీలో ఆచరించే వాళ్ళను రాజసులు, తామసులు అని అంటారు. అందువలన సమస్యలు భయం, దుఃఖం అయితే, కారణాలు కోరికలు, సంసారం అవుతాయి. ఇందుకు పరిష్కారమార్గం కర్మ, భక్తి, జ్ఞానం, యోగం, యజ్ఞం లాంటి ప్రక్రియలు.

గీతలో ద్వంద్వాల విభజన, దుఃఖించతగినది తగనిదిగా ప్రారంభమై, గుణత్రయం వరకు విస్తరించి వాటిని ద్వంద్వాతీత, గుణాతీత స్థితిలో, యజ్ఞ యాగ హెూమాలలో సంయోగం చేసినప్పుడు యోగసిద్ధి కలుగుతుంది. అనగా ఆత్మ పరమాత్మలో లయమౌతుంది. అందుచేత మొదటి అధ్యాయంలో విషాదం నుండి పదునెనిమిది అధ్యాయంలో మోక్ష సన్యాసం వరకు యోగాన్ని జతచేయబడింది. అంటే సర్వం లయమైనపుడు అంతా యోగమౌతుంది. ఆ కారణంగా వ్యక్తులు తమ తమ కర్మలను యోగంతో ముడివేసి యోగులుగా పరిణితి చెందేందుకు గీత ఉపయోగపడుతుంది. శ్రీమన్నారాయణ అవతారమైన శ్రీకృష్ణుడు, శిష్యుడు, బావమరిది అయిన అర్జునుడికి రథచోదకుడిగా ఉండటంలోని అంతరార్థం.

పని చిన్నదా, పెద్దదా, అల్పమైనదా, గొప్పదా అన్న తేడాలేక ప్రతి మానవుడు తమ తమ శారీరక మానసిక గుణగణాలకు తగిన విధంగా చేసేపనిలో నైపుణ్యాన్ని చూపించి దానిని ఒక విధిగా చేయడం, వ్యక్తికి కుటుంబానికి సమాజానికి శ్రేయస్సు కలుగజేయటమే కాక, సమతౌల్యాన్ని సాధించేందుకు ఉపకరణం అవుతుంది. పైపెచ్చు ద్వంద్వ విభజన మానవాళికి మరియొక గొప్ప సందేశాన్ని అందించింది. ఏమానవుడైతే తనకు సంబంధంలేని, తన ధర్మంకాని, తన ప్రమేయం అవసరంలేని వాటిలో తలదూర్చినప్పుడు దుఃఖానికి బద్ధుడై, ధర్మానికి, ఆనందానికి దూరమౌతాడు.

ద్వితీయ అధ్యాయం

మానవ సమస్య

జీవితం సంసారమయం. సంసారం కోరికల గూడు. మనస్సు సాలీడులా పంచేంద్రియాలతో కోరికలను, మనస్సులోనుండి వెలికితీసి మరలా మనస్సులో లయంచేస్తుంది. ఆ కారణంగా శారీరక కోరికలు, మనస్సు నుండి జనించి మరలా అదే మనస్సుతో అంగీకరించి నిరాకరించే ప్రక్రియ ఒక సంసార వ్యాపారం. మనస్సు ఎప్పుడు, ఎందుకు ఈ బాహ్య ప్రపంచంలోని జీవులను, జీవేతరములను కోరుకుంటుందో త్యజిస్తుందో ఆ మనస్సుకు కూడా అర్థం కాదు. అందుచేత జీవితం ఒక సమస్య. ఈ సమస్య నుండి ద్వంద్వాల ద్వారా, గుణగణాల ద్వారా, ఆశా నిరాశల ద్వారా, ప్రేమ పగల ద్వారా, భయ ఉద్వేగాల ద్వారా, సమస్యల సంకెళ్ళను వేయించుకొని, వాటి సంతతి అయిన దుఃఖాలతో సతమతమవుతుండడం మానవుని కర్మ ఖర్మలుగా ప్రత్యక్షమవుతాయి. అనగా తల్లి గర్భంలో ప్రవేశించినది లగాయతు జీవుడు తమ అంతిమయాత్ర వరకు జరిగే ప్రయాణంలో ఎన్నో సమస్యలు అడ్డంకులు, పిరికితనం, అసమర్థత, వైఫల్యం, దీనత్వం, నిర్వీర్యం లాంటివి భయాన్ని కలిగించి సమస్యలుగా తయారవుతాయి. ఈ సమస్యలను అధిగమించేందుకు భగవంతుని కృపను ఆసరాగా చేసుకుంటే, జీవనప్రయాణం సుగమము అవుతుంది.

భగవంతుడిని, బ్రహ్మజ్ఞానాన్ని, ఆత్మజ్ఞానాన్ని తెలుసుకొనేందుకు పనికివచ్చే ఉపకరణాలైన ఇంద్రియాలు, మనస్సు, అడ్డంకులుగా తయారవుతాయి. జ్ఞాని అయినవాడు భగవంతుని శరణుజొచ్చి, ఆ అడ్డంకులను తొలగించుకుని 'నేను' అన్నదాన్ని వదలినపుడు ఈ ఉ

పకరణాల అడ్డంకులు సునాయాసంగా తొలగిపోతాయి అన్నది గీతలో అంతర్లీనంగా శ్రీకృష్ణుడు అందించిన సందేశం. జీవితంలో ముఖ్యమైన సమస్యలు, కోరికలు భయం దుఃఖం. వీటిని గురించిన విశ్లేషణ ఈ క్రింద పొందుపరచడం జరిగింది.

1. కోరికలు

మానవ జీవితం కోరికల పుట్ట. ఆ పుట్టనుండి కోరికలు పిగులు తుంటాయి. కోరికలను తృప్తిపరిచేకొద్ది వాటి సంఖ్య రెట్టింపై పెరుగుతూ ఉంటుంది. అంటే ఒక కోరికను తీరిస్తే, రెండు కోరికలు పుడుతాయి. రెండు తీరిస్తే నాలుగు, నాలుగు నుండి 16, 32 అలా రెట్టింపు అవుతాయి. కోరికలు లేని మానవుడుండడు. కోరిక పుట్టుకతో ప్రారంభమై మరణంతో ముగుస్తుంది. ఈ కోరిక శరీరంలో ఆకలిగా నిద్రలో కలలుగా, పంచేంద్రియాలలో అనుభవాలుగా అనేక రూపాల్లో ప్రత్యక్షమౌతుంటుంది. ఇదే కోరిక మనస్సులో ఆశలు ఆశయాలుగా, ఆవేదనలు ఆక్రోశాలుగా, ప్రేమలు పగలుగా, భక్తి వైరాగ్యములుగా, మంచి చెడ్డలుగా, ద్వంద్వ స్థితిని సంతరించుకొని తద్వారా నిరంతరము సుఖదుఃఖాల ఒత్తిడితో సందిగ్ధంతో, ఒరిపిడితో, ఘర్షణతో ఏమిచేయ్యాలో పాలుపోక కాలుగాలిన పిల్లిలా ఆరాటంతో ప్రవర్తిస్తూ జీవితాన్ని మలుపులు తిప్పుతుంటుంది. కోరికలు మనస్సు నుండి ప్రసరించినప్పటికీ శారీరక, మానసిక, ఆధ్యాత్మిక రకాలుగా విభజించవచ్చు. ధర్మ అర్ధ కామ మోక్షాలలో, అర్థ కామాలు శారీరక మానసిక సంబంధాలు కాగా, ధర్మం మానసిక సంబంధం మోక్షం ఆత్మసంబంధంగా గమనించడంలో వాటి అర్థం అంతరార్థం తెలుసుకోవడానికి సహాయపడుతాయి.

సృష్టిలో 84 లక్షల జీవరాశులలో మానవుని శారీరక, మానసిక నిర్మాణం, కార్యక్రమం పరిమాణం, జీవనగతి మిగతా వాటికంటే చాలా

భిన్నంగా ఉంటుంది. ప్రతి జీవిలో ఒక్కొక్క ఇంద్రియం బలంగా ఉండి ఒక చర్యమీదనే శక్తిని కేంద్రీకృతం చేసి తనను తాను సంరక్షించుకునే క్రమంలో పుట్టుక, పెరుగుదల, క్షీణించడం, నశించడం సహజం అవుతుంది. కాని మానవులలో 5 పంచేంద్రియాలు, 5 జ్ఞానేంద్రియాలు, మనస్సు, బుద్ధి, అహంకారం త్రిగుణాలు, వాసనలు, కనబడీ కనబడని శక్తులు నిక్షిప్తమై జీవితాన్ని నడిపిస్తుంటాయి.

కోరికలను బట్టి మానవజీవితం ఆధారపడి ఉంటుంది. మానవుని కోరికలు, వాని గుణగణాలను మానవుని ఊహలను ప్రేరణలను, చర్యలను ప్రతిచర్యలను, వాక్కులను ఫలితములను, తృప్తి అసంతృప్తులను, భావోద్వేగాలను, సందిగ్ధాలను, తీర్మానాలను నిర్ధారిస్తాయి.

కోరికలు అనేక రకాలుగా ఉంటాయి. కోరికలు శరీరానికి సంబంధించినవి, మనస్సుకు సంబంధించినవి, బాహ్య ప్రపంచానికి సంబంధించినవి , దైవానికి సంబంధించినవిగా ఉంటాయి. కోరికలు కోరడం సులభం. వాటిని సాధించే దానికి కృషి అభ్యాసం కష్టం. అందుకే **"కృషితో నాస్తి దుర్భిక్షం"** అన్నారు. కోరికలు దేశ కాలమాన పరిస్థితులను బట్టి, వయస్సును బట్టి, శరీర తత్వాన్ని బట్టి, మానసిక స్థితిని బట్టి, స్నేహ వాతావరణాన్ని బట్టి మారుతుంటాయి. కోరికలన్నింటిని తీర్చుకోలేరని తెలిసిన విజ్ఞులు, కోరికలు మితంగా ఉంటే జీవుడు తృప్తిగా జీవిస్తాడని అన్ని గ్రంథాల్లో నొక్కి చెప్పారు.

వ్యాప్తిం బొందక వగవక,
ప్రాప్తంబగు లేశమైన బదివేలనుచుం
దృప్తించెందని మనుజుడు,
సప్తద్వీపములనైనఁ జక్కంబడునే? – భాగవతం

మానవులకు మంచి వాతావరణంలో మంచి కోరికలు, చెడ్డ వాతావరణంలో చెడ్డకోరికలు పుడతాయి. ఇది ఎలా అంటే సత్సంగంలో, సాధువు సాధువు కలుసుకుంటే, ఆత్మ పరమాత్మ, భగవంతుడు, పుణ్యం, పాపం, స్వర్గం, నరకం, త్యాగం, ధర్మం లాంటి మంచి విషయాలు మాట్లాడు కుంటారు. కాని ఒక గాడిద మరొక గాడిదతో కలిస్తే అవి వెనుకకు తిరిగి నిలబడి వాటి వెనుక కాళ్ళతో ఒకదానినొకటి పెటీల్‌మని తన్నుకుంటాయి. కోరికలకు ఒక విచిత్రమైన లక్షణం ఉంది. కోరిక గమ్యస్థానం చివరకు అశాంతే. కోరిన కోరిక తీరితే మంచిదే. కాని కోరిక తీరీ తీరకముందే మరొక కోరిక ఆ ఖాళీ ప్రదేశాన్ని ఆక్రమిస్తుంది. లేదా తీరిందనే ధైర్యంతో మరికొన్ని కోరికలు పుడతాయి. ఒకవేళ కోరిక తీరలేదా బాధ, దుఃఖం, అసూయ, అశాంతి, అలజడి, వీటివలన కోపం, మానసిక ఒత్తిడి, మానసిక ఆరాటం, పోరాటం, ఇతరులను నిందించడం, పొరపాటు చేయడం, వ్యసనాలకు లోనుకావడం, తప్పుమీద తప్పు చేయడం, చివరకు సంకెళ్ళను కౌగలించుకొని నిరాశ నిస్పృహలతో జీవితాన్ని గడిపివేయడం. ఇదీ వరుస క్రమం.

అసలు ఎవరు ఏ కోరికను కోరవచ్చు, అంగీకరించవచ్చు, ప్రయత్నించవచ్చు. ఆ కోరిక సమంజసమైనదా? తనకు, తోటివారికి ఉపయోగమౌతుందా? కోరిక తీరక పోతే ఎలాంటి బాధలు కష్టాలు ఎదుర్కోవాలి? ఈ ప్రక్రియ వలన కలిగే సత్ఫలితాలు, దుష్ఫలితాలు ఏమిటి అన్నది తెలుసుకోవడం జ్ఞానం. ఇలా ఒప్పులను, తప్పులను, కోరికలను జనింపజేసి, పెంచిపోషించి, వెంపరలాడి కలిగే పర్యవసానాలను చరిత్రద్వారా, పురాణాలద్వారా, విజ్ఞాన గ్రంథాల ద్వారా ఆవిష్కరించబడి ఉన్నాయి కాబట్టి కోరికకు పుట్టుక కోరికే. అందుచేత కోరికకు మొదలు ఉ

ంటుంది కానీ తుది ఉండదు. అందుచేత కోరిక నిడివిని గురించి భాగవతంలో బలిచక్రవర్తితో వామనమూర్తి అన్న మాటలు గమనించతగినవి.

ఆశాపాశము తాఁగడున్ నిడుపు, లేదంతంబు రాజేంద్ర! వా
రాశీప్రావృత మేదినివలయ సామ్రాజ్యంబు చేకూరియున్
గాసిం బొందిరిగాక వైన్యగయ భూకాంతాదులు న్నర్థకా
మాశన్ బాయఁగ నేర్చిరే? మును నిజాశాంతంబులం జూచిరే?

(రాజా! ఆశ అనే తాడు చాలా పొడవైనది. దానికంతంలేదు. ఎంత లభించిన మరింత లభించాలనే ఆశిస్తారు. ఆశను చంపుకోవడం కష్టం. సమస్త సామ్రాజ్యాన్ని పొందినా ఇంకా పొందాలనే ఆశను విడలేరు)

దీని అంతరార్థం ఆశ మొదలు, దాని చివర దురాశ. దానికి తుది లేదు. ఆశ అగ్నిలాంటిది. అది ఇంట్లో భోజనం తయారుచేసుకొనడానికి ఉపయోగపడుతుంది. అదే అగ్ని చూరు అంటుకుని ఇంటిని చుట్టు ప్రక్కల వాతావరణం అంతటినీ దహించివేస్తుంది. కాబట్టి కోరికను బహు జాగ్రత్తగా ఉపయోగించుకోలేనపుడు జీవితం సర్వనాశనం అవుతుంది. అనగా కోరిక ఇంటిలో కుంపటిలో అగ్ని అయితే దురాశ దావానలం అవుతుంది. దురాశ పరులలో నూటికి తొంభైతొమ్మిది మంది జీవితంలో ఓడిపోయినవారే. మానవుడు ఆశను తీర్చుకోగలడు కాని, దురాశను తీర్చుకోలేడు.

ఒక్క కోరికను తృప్తి పరిచితే మరి ఒక కోరిక దానిస్థానంలో వచ్చి కూర్చుంటుంది. ఇవన్నీ కోరికల జడ. జుట్టును మెలికలు తిప్పి జడవేసిన విధంగా కోరికలు తామంతట తాము జడలను వేసుకుంటాయి. జడలు వేసుకోవడం జడత్వం వలన కావచ్చు. జడత్వం వలన జుట్టు అట్టలు కట్టుకోని పోతాయి. ఒక వెంట్రుకనుంచి మరొక వెంట్రుకను తీయలేని విధంగా ఒక కోరిక నుండి ఇంకొక కోరికను విడదీయలేం. జ్ఞానంతో,

తెలివితో, విచక్షణతో, సద్బుద్ధితో, సహనంతో, కోరికలను అదుపులో పెట్టుకోవడం, జుట్టును చమురు పెట్టి దువ్వి జడవేయడం లాంటిదే. ఎంతో ప్రేమగా, ముద్దుగా, అభిమానంగా చూసుకొని పోషించిన వెంట్రుక తలనుండి రాలిపోతే ఎడమ చేతితో పట్టుకొని దూరంగా మురికి కాలువలో వేస్తాం. ఆ వెంట్రుక మనకు తీరని కోరిక లాంటిది. మనం సాధించలేక పోయి మనల్ని నిరాశా, నిస్పృహలకు లోను చేసిన కోరిక లాంటిది. కోరికలు అనేకం. కోరికకు విచక్షణ కాని, వివేకంకాని ఉండదు. కోరికలు వయస్సును బట్టి మారుతుంటాయి. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు కోరికలే. తపస్సు చేసి మోక్షం సంపాదించడం కూడా కోరికే అయితే తపస్సు చేసి కోరికలన్నింటినీ దాటితే లేదా కోరికలను దగ్ధంచేస్తే మిగిలేదే మోక్షం.

2. భయం

మానవుడు పుట్టుకతో భయంతో ప్రారంభమై చివరకు మృత్యువు అనే పదాన్ని వినడానికి కూడా భయపడతాడు. కోరికకు దుఖానికి మధ్యలో జనించే భయం వైరాగ్యంతో సమసిపోతుంది. జీవునికి పంచభూతాలను వాటి ఛాయలను చూస్తే భయం. వెలుగు, చీకటి, తల్లి, తండ్రి, గురువు, అపరిచితుడు, ఔను, కాదు, అజ్ఞానం లాంటి వాటితో భయం. నేర్చుకోవాలంటే, పని చేయాలంటే, భయం. గుర్తుందనే భయం, మరచిపోయాననే భయం. ఉద్యోగం వస్తుందని భయం. రాదని భయం. పెళ్ళి అంటే భయం. వ్యాధి అంటే భయం. మృత్యువు అంటే భయం. పురుగులు, పక్షులు మృగాలు అంటే భయం. దారిద్ర్యం అంటే భయం. ధనం వుంటే భయం. ధనం లేకపోతే భయం. సంకల్పం సఫలమవుతుంటే భయం. సఫలం కాకుంటే భయం. దయ్యం అంటే భయం. దేవుడంటే భయం. పోలీసులంటే, న్యాయవాదులంటే భయం,

కోరికలంటే భయం, చనిపోయినవాళ్ళంటే భయం, వ్యాధిగ్రస్తులంటే భయం, నూటికి యాభైవంతుల కాలం భయంతో గడిచిపోతుంది మానవునికి.

నరనారాయణులలో ఒకడైన అర్జునుడు యుద్ధం చేయడానికి ఎంతో సన్నద్ధుడై వచ్చి తీరా యుద్ధభూమిలో "కృష్ణా! యుద్ధాశక్తులై ఎదురుగా ఉన్న చుట్టాలను చూడగానే నా అవయవాలు తడబడు తున్నాయి. నోరు ఎండిపోతున్నది. శరీరమంతా గగుర్పాటుతో కంపిస్తున్నది. గాండీవం చేతిలో నుంచి జారిపోతున్నది. దేహం మండు తున్నది. నిలబడడానికి కూడా శక్తిలేదు. నా మనస్సు తల్లడిల్లుతున్నది. గురువులు బంధువులను చంపి ముల్లోకాలను ఏలే అవకాశం కలిగి పొందే సంతోషం కంటే పాపమే ఎక్కువని పిస్తుంది. స్వజనాన్ని వధించి ఎలా సుఖ పడగలం"? అని భయంతో వణికిపోతాడు. మరలా "వంశం నాశనమై పోతుంది. కులధర్మాలు నశిస్తాయి. అధర్మం అలుము కుంటుంది. కుల స్త్రీలు చెడిపోతారు. జాతి సంకరమవుతుంది. పితృదేవతలు అధోగతి పాలవుతారు. జాతిధర్మాలు కులధర్మాలు అడుగంటి పోతాయి. వారు శాశ్వత నరకవాసులు అవుతారు. ఇంతకంటే నన్ను యుద్ధంలో సంహరిస్తే నాకు మరింత మంచిది కదా" అని భయంతో విలపిస్తాడు.

1వ అధ్యాయంలో 28 నుండి 47వ శ్లోకం వరకు ధీరోదాత్తుడైన అర్జునుడంతటివాడు, యుద్ధానికి సిద్ధంగా ఉన్న తన తాతలను గురువులను మేనమామలను సోదరులను పుత్రులను పౌత్రులను మిత్రులను బంధువులను చూచి భయంతో దుఃఖిస్తూ విశేష కృపాంతరంగుడై, విషాదానికి, భయానికి, దయకు, వశుడై యుద్ధం చేయలేనని కృష్ణుడికి మొరపెట్టుకోవడంలో, భయం దుఃఖం, మానవ జీవితంలో ఎంత బలమైనవో అర్థమౌతుంది. అంటే ఏ వ్యక్తికి అయినా

అది మంచిపని గాని, చెడ్డపని గాని జీవితంలో భయం ఎంతో ప్రముఖ పాత్రను పోషిస్తుంది అన్నదానికి ఇది ఒక తార్కాణం.

భర్తృహరి సుభాషితం, భయాన్ని గురించిన స్వరూపాన్ని విశదీకరిస్తుంది.

భోగే రోగ భయం, కులే చ్యుతి భయం, విత్తే నృపాలాద్భయమ్
మానే దైన్య భయం, బలే రిపు భయం రూపే జరాయా భయమ్।
శాస్త్రే వాద భయం, గుణే ఖలభయం కాయే కృతాంతాద్భయమ్
సర్వం వస్తు భయాన్వితం భువి నృణాం వైరాగ్యమే వాభయమ్॥

(-భర్తృహరి వైరాగ్య శతకం-31)

(భోగికి రోగం వస్తుందేమోనని భయం, కులీనునని సంతోషించేవానికి ఆ కుల గౌరవం కోల్పోతాననే భయం, ధనికునికి ప్రభువులనుంచి భయం, అభిమానవంతునికి యాచించాల్సిన అవసరం వస్తుందనే భయం బలవంతునికి మరొక బలవంతుడు ఉంటాడనే భయం, సౌందర్యవంతులకు అందం పోతుందనే భయం, విద్వాంసునికి మరొక విద్వాంసుని చేతిలో పరాభవం చెందాల్సి వస్తుందేమోననే భయం, గుణవంతులకు దుర్మార్గుల నుంచి భయం, శరీరానికి యముడు నుంచి మృత్యు భయం, భూమిలో అన్ని వస్తువులు భయంతో కలిసి వుండేవే. మనుషులకు అభయం, వైరాగ్యం ఒక్కటే).

3. దుఃఖం

జీవితంలో దుఃఖానికి ఒక ప్రముఖ పాత్ర ఉంది. పుట్టిన శిశువు జీవితాన్ని ఏడుపుతో ప్రారంభిస్తుంది. విషాదం దుఃఖాన్ని వెలిబుచ్చే సాధనం దుఃఖంతో ప్రారంభమైన జీవితం శారీరక మానసిక కష్టాలవలన సంఘర్షణల వలన దుఃఖ బాధితులకు ఆశలను దురాశలుగా మలచి, శక్తిని నిర్వీర్యం చేసి, కామ క్రోద లోభ మోహ మధ మాత్సర్యాల వలన

ఆశించిన ఫలితాలు పొందలేక, క్రుంగి కృషించి, మరణ మృదంగం వాయించే స్థితికి తీసుకు పోతుంది.

ప్రకృతిలోని అన్ని జీవులలో దుఃఖంతో బాధపడే జీవి మానవుడు. మిగతా జీవులకు ప్రకృతి విధించిన ఆహార నిద్ర మైదునాలు, శారీరక కష్టం వల్ల నొప్పి ఇబ్బంది ఉంటుంది. కాని కోరిక తీరలేదనే బెంగ, నిరంతరం తీరుతుందా లేదా అన్న ఆలోచన, కోరిక తీరినంతనే దానిని మరచిపోయి క్రొత్త కోరికల కొరకు వెంపరలాడుతూ, అవిశ్రాంతంగా, పిచ్చిపిచ్చిగా, కాలుగాలిన పిల్లిలా, ఏమిచేయాలో తోచక ఒక రకమైన గ్లానితో, సందిగ్ధంలో పడడం మానవుడికి మాత్రమే పరిమితం. దీనికి కారణాలు అనేకం.

దుఃఖం విషయంలో మిత్రులు, శత్రువులు కలిసికట్టుగా పనిచేస్తారు.

మిత్రులు : ఆసక్తి, కామం, మోహం, సుఖం, సంసారం.

శత్రువులు: భయం, అసూయ, క్రోధం, మదం, మాత్సర్యం, పాపం, పిసినారితనం, విరక్తి, చెడు ఆలోచనలు. రజస్సు, తమస్సు, అహంకారం, స్వార్థం, అనుమానం, ద్వేషం.

నివారణోపాయాలు : జ్ఞానం, ధ్యానం, యోగాభ్యాసం, శ్రవణం, ప్రార్థన, సంకీర్తన, సత్యం, వైరాగ్యం, మౌనం.

కోరిక తీరకపోతే, ఆకలివేస్తే, పగతీరకపోతే, చనిపోతే విషాదం మొదలవుతుంది. అన్ని మాటలకు, చేతలకు, జయాలకు, అపజయాలకు మూలం విషాదం అవుతుంది.

అందుచేతనే బుద్ధుడు తన ప్రాథమిక సూత్రాన్ని దుఃఖంగా, దానికి కారణం తృష్ణగా, దానికి కారణం అజ్ఞానంగా అందువలన నిర్వాణం అవసరమని, అలాంటి దుఃఖాన్ని అధిగమించేందుకు అష్టాంగాలు ఉపకరిస్తాయని చెప్పినది భగవద్గీతలో శ్రీకృష్ణుడు వచించిన దానిలోని భాగమే.

అలాగే ఆదిశంకరులు

జన్మ దుఃఖం జరా దుఃఖం
జయా దుఃఖం పునః పునః
సంసారం సాగరం దుఃఖం
తస్మాత్ జాగ్రత్త జాగ్రత్త.

అంటే దుఃఖం అనేది మానవుల జీవితంలో సహజ సిద్ధమైనది. ప్రేమలో, పగలో, ద్వేషంలో, హాస్యంలో పెనవేసుకొని నీడలా వెన్నంటే ఉంటుంది. బాధ, ఆవేదన, కష్టం కూడా అలాంటివే. ఇవి దుఃఖం కోవకు చెందిన కారణంగా ఎవరికైనా మొదలు తుది, దుఃఖంతో నిండి ఉంటుంది. దుఃఖాన్ని, విషాదం, శోకం, విచారం, దిగులు లాంటి అర్థాలేకాక వైరుధ్యం, ఘర్షణ, కష్టం, బాధ అన్నవి కూడా అన్వయించుకోవడంలో ఒక స్పష్టత కనబడుతుంది.

పుట్టుకతో దుఃఖం ఉంటుంది. మరణంలో దుఃఖం ఉంటుంది. జ్ఞానం లేకుంటే దుఃఖం, జ్ఞానం సంపాదిస్తే దుఃఖం, సంపద లేకపోతే దుఃఖం, ఉంటే దుఃఖం, మంచి చెడులలో దుఃఖం వెన్నంటే ఉంటుంది. సుఖం తర్వాత దుఃఖం, దుఃఖం తర్వాత సుఖం, రాత్రింబవళ్ళలా ఒకదానివెంట ఒకటి వస్తూపోతుంటాయి. ఒకదానిని మరొకటి తరుము తుంటాయి. దుఃఖం మానవున్ని కృంగదీసినపుడు, శాంతి కరువైనప్పుడు, మనస్సు చంచలమైనప్పుడు, బుద్ధి మలిన మయినప్పుడు, జ్ఞానాగ్ని వాటిని దహించి వేస్తుంది.

శాశ్వతం అయిన వాటిని అశాశ్వతం నుండి విభజించి, వాటిమీద రాగాన్ని పెంచే అభ్యాసం అనగా మంచిని నిలుపుకుని, చెత్తను జల్లెడ సందుల నుండి వదిలివేసే విధానమే, **వైరాగ్య అభ్యాసం.**

తృతీయ అధ్యాయం
గీతా సమాధానం

జ్ఞానులు సంసారాన్ని సముద్రంతో పోల్చారు. ఈ సముద్రాన్ని దాటడానికి ఎదురయ్యే సమస్యలను అర్థంచేసుకొని, ఓర్పుతో, నేర్పుతో పడవ మునిగిపోకుండా దాటాలి. సముద్రంలోని సమస్యల అలల, జలచరాల బారినుండి, భయాన్ని దుఃఖాన్ని, పారద్రోలి నిశ్చలమైన మనస్సుతో, స్థితప్రజ్ఞత్వంతో ఆవలిగట్టుకు చేరాలి. ఈ ప్రక్రియలో జీవన సమస్యలైన, కోరికలను, భయాన్ని, దుఃఖాన్ని జయించేందుకు, పురుష ప్రయత్నంతో **యుద్ధం** చేయాలి. చెడ్డ కోరికలను మంచి కోరికలతో యుద్ధంచేసిన విధంగానే భయాన్ని, బలహీనతను, దౌర్భల్యాన్ని, **ధర్మంతో** సమాధానం పర్చాలి. ఆ కోవలో మానవుడిని పీడించే దుఃఖాన్ని, దుఃఖాతీతము, ద్వంద్వాతీతము, గుణాతీతమైన **యోగ** ప్రక్రియలద్వారా పరిష్కరించాలి. లేనిచో జీవితయుద్ధంలో ఓడిపోయి, అధర్మంలో దిగజారిపోయి, ద్వంద్వాలలో ఇరుక్కుని, జీవితం దుర్భరమౌతుంది. ఈ అధ్యాయంలో వీటిని గూర్చి క్రింద విశదీకరించడం జరిగింది.

1. యుద్ధం

మానవ జీవన స్రవంతిలో విడదీయరాని కార్యక్రమం యుద్ధం. ఆదిమ మానవుడి లగాయితు నేటి నాగరిక సమాజం వరకు వ్యక్తికి వ్యక్తికీ, స్త్రీ పురుషుల, బలవంతుల బలహీనుల, కులాల మతాల, తెగల, దేశాల, సిద్ధాంతాల మధ్య ఒకరిమీద మరొకరు పోరాడి గెలవాలని ఎన్నో యుద్ధాలు జరిగాయి. ఆహారం కొరకు, నీటి వనరుల కొరకు, స్త్రీల కొరకు, పదవుల కొరకు, పగ ప్రతీకారం కొరకు యుద్ధాలు

జరుగుతున్నవి. అందువలన యుద్ధం ఒక జీవిత భాగస్వామ్య కార్య క్రమంగా తయారయ్యింది. ఆ కారణంగా జీవితం ప్రతివాడికి ఒక మహా యుద్ధం. మానవుడు తన లోపల బయట అనేక శక్తులతో పోరాడితే తప్ప, చెడ్డను జయించి మంచిని పెంచుకుని, మోక్షానికి అర్హత సంపాదించలేడు.

దుఃఖాన్ని జయించేందుకు ప్రతిమానవుడు నిరంతరం, పుట్టినది మొదలు గిట్టేంత వరకు యుద్ధం చేస్తూ వుంటాడు. యుద్ధం ఇంద్రియాల మధ్య, పంచభూతాల మధ్య, జ్ఞానేంద్రియాల మధ్య, శరీరానికి మనస్సుకు మధ్య, మనిషికి మనిషికి మధ్య, స్త్రీ పురుషుల మధ్య, ద్వంద్వాల మధ్య నిరంతరం నడుస్తూ వుంటుంది. అరిషడ్వర్గాల మధ్య, గుణాల మధ్య, శరీరం మనస్సు మధ్య, మనస్సు బుద్ధి అహంకారం మధ్య, ధనం దారిద్ర్యం మధ్య, మంచిచెడులు మధ్య, ధర్మాధర్మాల మధ్య, న్యాయా న్యాయాల మధ్య, రాత్రి పగలు మధ్య, భూమి ఆకాశం మధ్య, నీరు నిప్పు మధ్య, గాలి నీరు మధ్య, యుద్ధం నడుస్తుంటుంది. భూమికి గాలి, నీరు, నిప్పుల మధ్య యుద్ధం. ప్రేమ పగ, ప్రీతి అప్రీతి, ఆహారం ఆకలి మధ్య యుద్ధం. చెట్లు చేమలు పుట్టలు జంతువులు మానవుల మధ్య యుద్ధం.

దుఃఖించతగని దానిని, దుఃఖించ తగిన దానితో నశింపజేయడం, దుఃఖం మీద యుద్ధంచేసి ద్వంద్వాతీత స్థితికి చేరి విజయాన్ని సాధించడమే, మోక్షానికిచేరడం. మానవుడు సంసారబంధం నుండి బయటపడ్డానికి మోక్షానికి అర్హత సాధించడానికి, కర్మఫల త్యాగాన్ని అందుకోడానికి, ఆనందించడానికి యుద్ధం చేయాలి. ఈ యుద్ధం పగను ప్రేమతో, అజ్ఞానం ఆత్మజ్ఞానంతో అధర్మాన్ని ధర్మంతో, దౌర్భల్యాన్ని ధైర్యంతో, భయాన్ని అభయంతో, ద్వేషాన్ని అనురాగంతో,

మమకారాన్ని విరక్తితో, అవివేకాన్ని వివేకంతో, దుఖాన్ని సంతోషంతో, రాగాన్ని వైరాగ్యంతో, అసూయను అనసూయతో, కర్మను నిష్కామకర్మతో యుద్ధంచేయాలి. ఈ విషయాన్ని భగవద్గీతలో జగద్గురువైన శ్రీకృష్ణుడు ఉత్తమోత్తమ శిష్యుడు అర్జునునికి బోధించాడు. అదేవిధంగా మనంకూడా అనుసరించాలని ఈ సంఘటన అంతరార్థం.

అలాగే మానవుడు అహింస, అసహనం, అశాంతి, కపటం, గర్వం, దురహంకారం, కోపం, ఆశ, కాఠిన్యం, అవివేకం, కోపం, అలక్ష్యం, బద్ధకం, బుద్ధిమాద్యం, దురభిమానం, దురాచారం, అశుచిత్యం, అసత్యం, మదం, కామం, క్రోధం, లోభం, మోహం, మదం, మాత్సర్యం, అసూయ, అశాంతి, మాయ, సంసారం, వికారం మీద యుద్ధం చేయాలి. ఆధ్యాత్మిక విధానాన్ని సాధనంగా చేసుకుని యుద్ధం చేయాలి.

యుద్ధాన్ని ద్వంద్వాల కోణం నుండి విభజిస్తే ధర్మయుద్ధం, అధర్మ యుద్ధంగా చూడవచ్చు. యుద్ధాన్ని గుణాల కోణం నుండి చూస్తే, సాత్విక రాజసిక, తామసిక యుద్ధాలుగా విభజించవచ్చు. భగవంతుడు ఈ సృష్టిని అనేక జీవులలో ఉద్భవింపచేసి, మరలా లయం సంహారం చేసిన తీరున, వ్యక్తి ఆనందానికి మోక్షానికి కారణాలైన అవగుణాలను అనర్హునిగా చేసే రుగ్మతలను, దోషాలను, తిరుగుబాటుచేసి యుద్ధం చేసి భగవద్భక్తిలో నిష్కామకర్మ చేయడమే గీతా సారాంశం.

ధర్మంకోసం, న్యాయంకోసం దేవతలను పితృదేవతలను, ప్రజలను సంతోష పెట్టేందుకు విద్యుక్త ధర్మాన్ని నిర్వర్తించే ప్రక్రియలో శ్రీమన్నారాయణుడైన శ్రీకృష్ణుడి సమక్షంలో అర్జునుడంతటివాడు విషాదంతో ఘొల్లు మంటే సామాన్య మానవులు తమ తమ దైనందిన

జీవిత కార్యక్రమాలలో దుఃఖించడం పెద్ద విషయమేమికాదు. అర్జునుడు యుద్ధభూమిలో చేసే యుద్ధం ప్రతిరోజు అందరూ తమ తమ జీవితాల్లో చేస్తున్న యుద్ధమే. అర్జునుడి విషాదం అందరిలో ఉండే విషాదమే. అలాంటి యుద్ధం, విషాదం నీలో, నాలో, మనందరిలో ఉన్నాయి. ముఖ్యంగా ఎవరైతే తమ జీవితంలో ధర్మాచరణ ముఖ్యమైనదిగా గ్రహించి అనుసరిస్తారో వారందరికి, యుద్ధం విషాదం, భగవద్గీతలో అర్జునుడి ద్వారా వినిపించిన సందేశం అందించిన సంకేతం.

శ్రీమద్భగవద్గీత మొదటి అధ్యాయం అర్జున విషాదయోగం "**ధర్మక్షేత్రే కురుక్షేత్రే**" అని ప్రారంభమై యుద్ధంతో ప్రారంభమైనది. కురుక్షేత్ర యుద్ధం పాపాన్ని ప్రక్షాళన చెయ్యడానికి చెడును నాశనం చెయ్యడానికి, రాక్షసత్వాన్ని నిర్మూలించడానికి, ధర్మాన్ని పరిరక్షించేదానికి మానవత్వాన్ని నిలబెట్టేదానికి, పుణ్యాన్ని సంపాదించేదానికి ప్రతీకగా నిలబడుతుంది.

ప్రతిజీవి జీవితం ఒక యుద్ధం. పుట్టింది లగాయితు మరణించే లోగా జీవుడు ఎన్నో యుద్ధాలను చేస్తాడో, ప్రారంభిస్తాడో, ముగిస్తాడో చెప్పలేం. ప్రతిక్షణం పంచేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు, త్రిగుణాలు నిరంతరం ఒకదానిమీద మరొకటి చేసే అంతర్యుద్ధాలను పరికించితే చాలా వింతగా ఉంటుంది. ఈ అంతర్యుద్ధాలు ఎన్నో బహిర్యుద్ధాలకు కారణభూతమౌతాయి.

అనేక సందర్భాల్లో అనేక వ్యక్తుల మధ్య చివరకు, తల్లిదండ్రులు, బిడ్డలు, సోదరులు, బంధువులు, మిత్రులు, శత్రువులు మధ్య జరిగే ఘర్షణలు, కురుక్షేత్ర యుద్ధాన్ని తలపిస్తాయి. శరీరము, మనస్సు బుద్ధి, భావము, జ్ఞాపకం, వివేకము, విచక్షణ ఒకదానికి ఒకటి పోటీపడి, ఒకదాన్ని మరొకటి అంగీకరించలేక జరిగే యుద్ధాలు కోకొల్లలు.

యుద్ధాలు తల్లి గర్భం నుండి బయటకు రావడంతో ప్రారంభమౌతాయి. శిశువు గర్భం నుండి విడిపడడం యుద్ధంచేస్తేగాని వీలుకాదు. అంటే జననం ఒక యుద్ధం. చివరలో మృత్యువుతో పోరాడడం కూడా ఒకపెద్ద యుద్ధం. మానవుడు చనిపోయేదానికి ససేమిరా ఒప్పుకోడు. శరీరము, మనస్సు, ఆత్మ ఒకదానితో ఒకటి యుద్ధంచేసి గింజుకుంటాయి.

అల్పులకు, అల్పాయుష్కులకు, నిర్వీర్యులకు, నిర్జీవులకు, అమాయకులకు, అచేతనులకు, మానసిక వికలాంగులకు భయాలు, యుద్ధాలు ఎక్కువగా ఉండవు. జ్ఞానులకు యోధులకు ధర్మవర్తనులకు, మేధావులకు జీవితం ఒక యుద్ధాల పుట్ట. ఎన్నియుద్ధాలు చేసి గెలిపొందితే అంత మహాత్ముడని పించుకుంటాడు. యుద్దాలు లేని జీవితం సున్నతో సమానం.

యుద్ధం రక్షణకు ప్రతీక. పంచతంత్రంలో వచించినట్లు, రాజు యొక్క ప్రధమ కర్తవ్యం, దాన ధర్మాలు చేయడం కాదు. పన్నులు వసూలు చేయడం కాదు. కేవలం ప్రజలను, ఆశ్రితులను రక్షించడమే. అందుచేతనే క్షత్రియునకు యుద్ధం చేయడం జన్మ హక్కుగా, మనువు, భీష్ముడు, శ్రీకృష్ణుడు, క్షత్రియ ధర్మం 'యుద్ధం' అని వక్కాణించారు. రక్షణ అనేక రకాలు. ప్రజలకు రక్షణ చేకూరాలంటే పనిని కల్పించడం ద్వారా, జ్ఞానాన్ని అందించడం ద్వారా, రక్షక వ్యవస్థను పటిష్ఠం చేయడం ద్వారా చేయవచ్చు. అంతేకాక సృష్టిలో అనగా ప్రకృతిలో అన్నిరకాల జీవ జంతువులను, అడవులను, నదులను, చెట్లను, కొండలను, పుట్టలను రక్షించి, వాతావరణ సమతౌల్యాన్న అందించి ప్రతి జీవి సుఖసంతోషాలతో ఇతరుల వలన ఇబ్బందులకు లోను కాకుండా ఉండేట్టు రక్షణ కల్పించడం రాజుయొక్క ధర్మం. ఇందుకు అనేక యుద్ధాలు జరపాలి. యుద్ధం చేస్తేగాని విజయం సాధించడం కుదరదు.

ఒక కవి అన్నట్టు. సంపదలు కాని ఆపదలు కాని మహాత్ములకు వస్తాయి కాని సామాన్యులకు రావు. వృద్ధి క్షయాలు చంద్రునికే గాని నక్షత్రాలకు వుండనివిధంగా, కోరిక కోపం, మానవునికి అనుకూల శత్రువులు. మానవుడు వాటితో సఖ్యంగా వుంటూ కూడా, వాటిద్వారా ఆనందాన్ని అనుభవిస్తూ కూడా, వాటితో నిరంతరం ప్రచ్ఛన్న యుద్ధం చేస్తూ వుంటాడు.

2. ధర్మం

ధర్మం అనగా సన్మార్గ ప్రవర్తన. సన్మార్గ ప్రవర్తనకు వేదాలు, ఉపనిషత్తులు ప్రమాణాలు. మానవుడు తన విధ్యుక్త కర్మలను శాస్త్రము చెప్పిన విధముగా అనుసరించడం ధర్మం. ధర్మం ద్వారా సుజ్ఞానాన్ని, సత్కర్మను ఆచరించి, ఈ జన్మకు కారకులైన తల్లిదండ్రులు, పంచ భూతాలు, ఇతర మానవ మానవేతరములన్నింటి నుండి ఋణవిముక్తు డవ్వడం, ధర్మాచరణకు నిదర్శనం. మంచి లక్ష్యాలను సాధించేందుకు సన్మార్గాలను సూచించే దిక్సూచి ధర్మం. వేద విధిని అనుసరిస్తే ఏ వ్యక్తి ధర్మం తప్పడానికి అవకాశం ఉండదు. భగవంతుడు పరబ్రహ్మంలో ఒక భాగం అనే జ్ఞానోదయం కలగాలంటే జ్ఞానసముపార్జనలో, కర్మాచరణలో ధర్మాన్ని అనుసరించాలి. అందుకే "**ధర్మో రక్షతి రక్షితః**" అన్నారు. ధర్మార్థ కామ మోక్షాల్లో ధర్మమే ప్రధాన పాత్ర పోషిస్తుంది.

ధర్మాదర్థః ప్రభవతి ధర్మాత్ ప్రభవతే సుఖమ్!

ధర్మేణ లభతే సర్వం ధర్మ సార మిదం జగత్!!

(ధర్మం వల్ల సంపదలు లభిస్తాయి. ధర్మం వల్ల సుఖం లభిస్తుంది. ధర్మం చేత సర్వమూ లభిస్తుంది. జగత్తుకు ఆధారమే ధర్మం.)

ద్విపాద పశువైన మానవుడు ధర్మబద్ధమైన కర్మ, భక్తి, జ్ఞాన, వైరాగ్యముల ద్వారా తాను భగవంతుని అంశ అన్న స్పృహతో భగవంతునిగా పరిణామం చెందగలడు. అందువలన ధర్మాన్ని బ్రహ్మము నుండి విడదీయలేము. అందుచే వేదముల సారము ధర్మం బ్రహ్మము ఒకటేనని పెద్దలు వక్కాణించారు. నిష్కామకర్మ, సద్భక్తి, ఆత్మ జ్ఞానము ధర్మాన్ని అనుసరించేందుకు దోహదపడుతుంది. ధర్మానికి రెండువైపులా పదునుంటుంది. ధర్మం అనేది మానవునికి లక్ష్యాన్ని సాధించే మార్గమవుతుంది. ధర్మంతో ముడివడ్డ అర్థకామాలు మానవున్ని సద్గతికి తీసుకువెళతాయి.

ధర్మం అనగా చట్టానికి, న్యాయానికి, స్థితి గతులకు లోబడి ఇంద్రియాలను నియంత్రించి శాస్త్ర సమ్మతమైన కర్మను ఆచరించి, జ్ఞానాన్ని సముపార్జించి, భక్తిని అభ్యాసం చేయడమే. అనగా కర్మ, భక్తి, జ్ఞాన, వైరాగ్యాల నుండి అధర్మాన్ని విడదీస్తే బండరాతిలో నుండి అనవసరమైన పదార్థాన్ని తొలగిస్తే మిగిలిపోయిన సౌందర్యరాశిగా నిలబడినట్టు ధర్మం తెలుస్తుంది. ధర్మం స్థూలంగా మూడు రకాలుగా విభజించవచ్చు.

1. **స్వధర్మం** : వ్యక్తి వృత్తి, ప్రవృత్తిని బట్టి అనుసరించవలసిన విద్యుక్త ధర్మం.

2. **సహధర్మం**: వ్యక్తి తనచుట్టూ వున్న ప్రపంచానికి నిర్వర్తించాల్సిన విద్యుక్త ధర్మం.

3. **సాధర్మం** : వ్యక్తి భగవంతుని అవతార అంతరార్థాన్ని అర్థం చేసుకొని అనుసరించడం దేశ, కాలమాన పరిస్థితుల ప్రభావం వలన ధర్మాధర్మాల తేడాలకనుగుణంగా మతసిద్ధాంతాలు, ఆవిర్భవించాయి. ఆ ప్రకారంగా వివిధ ఆచార వ్యవహారాలతో ధర్మాలను నిలబెట్టేందుకు

ప్రయత్నం చేశారు. ఎన్ని వాద ప్రతివాదాలు చేసినా, ధర్మం యొక్క లక్ష్యం మానవత్వాన్ని, శాంతిని, పరహితాన్ని, ప్రేమను, దైవత్వాన్ని, దయను, పరుల క్షేమాన్ని, దాన ధర్మాన్ని, పరమత సహనాన్ని, త్యాగాన్ని, సానుభూతిని, నిగర్వాన్ని, నిరహంకారాన్ని సుహృద్భావాన్ని, సమతా దృక్పథాన్ని సమానత్వాన్ని ఆధారం చేసుకొని రాగద్వేషాలకు అతీతంగా సుఖజీవనం చేస్తూ, సహజీవనం చేస్తూ సమ సమాజాన్ని నిర్మించి ప్రతి వ్యక్తి సచ్చిదానంద స్వరూపుడు కావాలి. భారతంలో ధర్మసారం ఈ క్రింది పద్యంలో వివరించబడింది.

ఒరు లేయవి యొనరించిన
నరవర! యప్రియము దనమనంబున కగుఁదా
నొరులకు నవి సేయకునికి
పరాయణము పరమధర్మపదముల కెల్లన్.

(అనగా ఉత్తమ ధర్మము, ఇతరులు మనకు ఏ పనులు చేస్తే అప్రియంగా వుంటాయో, అలాంటి పనులను మనం ఇతరులకు చేయకుండా వుండటమే.)

పరధర్మం అజ్ఞానం. పరధర్మం అనుకరిస్తే జీవితం ఓటమితో దుర్భరప్రాయమై పోతుంది.

మనస్సు దేహము అనేక రుగ్మతులకు గ్లానికి నిరంతరం లోనై ఉంటుంది కాబట్టి దాని నుండి బయటపడదానికి జ్ఞానంతో కూడిన కర్మను ఆచరించడం ఉత్తమ ధర్మం. నిత్యకర్మకు సత్కర్మకు తేడా తెలుసుకోవడం జ్ఞానం.

ప్రతిక్షణం ప్రతిపనిలో 'అవును కాదు', 'ఇదా అదా', 'ఇటా అటా', నువ్వా నేనా', 'ఇందా అందా' లతో సందిగ్ధావస్తలో ఉన్నప్పుడు దానికి సరైన జవాబు స్వధర్మం చెబుతుంది.

ధర్మం గొప్పతనాన్ని అర్థంచేసుకొనడానికి సులభమైన మార్గం, ఉత్తమోత్తమైన శ్రీరామావతారాన్ని గుర్తుచేసుకోవడమే. అందుకే **“రామో విగ్రహవాన్ ధర్మః”** అని అన్నారు.

3. యోగం

యోగం అనే పదానికి అనేక అర్థాలను సందర్భాన్ని బట్టి సూచించ వచ్చు. యోగం అనగా కలయిక. రెండు లేక అనేకం ఒకటై పోవడం. యోగం ఒక సంయోగం. యోగమనగా ఒక పద్ధతి, మార్గం. స్థిత ప్రజ్ఞత్వం. సమబుద్ధి. యోగం అద్వైతం. ఒక రూపం తన సస్వరూపంలో కలవడం యోగం. జీవాత్మ పరమాత్మలో లయం కావడం యోగం. అర్థకామాలను ధర్మంలో లయం చేయడం యోగం. ధర్మాన్ని మోక్షాన్ని ఒకటి చేయడం యోగం. కర్మను నిష్కామంతో జ్ఞానాగ్నిలో దగ్ధంచేయడం యోగం. విషాదమనే విషాన్ని అమృత తుల్యం చేయడం యోగం. అజ్ఞానాన్ని జ్ఞానం ద్వారా నిర్మూలించడం యోగం. కర్మను వాసనలనుండి క్షయంచేసి ధర్మంతో ముడివేయడం యోగం. కర్మలు సకామంగా చేసి కర్మఫల బంధనాన్ని నుండి విముక్తిచేయడం యోగం. లౌకిక జ్ఞానాన్ని అలౌకికమైన విజ్ఞానంతో మనస్సును ధ్యాన సమాధిలో నిలపడం యోగం.

సాధారణ మానవుడు తన **నిత్యజీవితంలో** మనో వాక్కాయ కరల్మయందు సమతౌల్యాన్ని సాధించడం యోగమౌతుంది. జీవితంలో ఒక ఘర్షణ, బాధ, అసంబద్ధమైన ఏ రెండు విషయాలైనా ఒకదానితో ఒకటి చేరినపుడు కలిగే ఉత్కృష్టత ఒక యోగం. సచ్చిదానందం ఒక యోగం. త్యాగం ఒక యోగం. యజ్ఞం, సన్యాసం, జ్ఞానం, కర్మ, భక్తి యోగాలే. ప్రపంచంలో ఏ వ్యక్తికైనా, ఏ వస్తువుకైనా, ఏ సంఘటనకైనా, ఏ విషయానికైనా యోగసిద్ధి కలగాలంటే పరిపూర్ణత్వాన్ని పొందాలి. పరిపూర్ణత్వం దాల్చిన ప్రతిది యోగమౌతుంది.

లయం కాదగినవన్ని పూర్తిగా లయమైపోయినపుడు నశించకుండా మిగిలేది, అక్షరపరబ్రహ్మ యోగం. యోగం అనగా వ్యక్త రూపంలో సృష్టినుండి లయం వరకు, అవ్యక్తరూపంలో తిరిగి లయం నుండి సృష్టి వరకు మార్పు అక్షరపరబ్రహ్మం. అవ్యక్తం నుండి వ్యక్తం చేసే అనంత శక్తిని తెలుసుకోవడం రాజవిద్య రాజగుహ్య యోగం. సృష్టి సంహారంలో వ్యక్తా వ్యక్తాల మధ్య స్థితిగతుల లీలా విశిష్టం తనలో వున్నదని తెలుసుకోవడం విబూతియోగం. భగవంతుడు సర్వం, సర్వంలో భగవంతుడు ఉన్నాడు అనే జ్ఞానంతో భక్తి పరిపక్వత పొందడం విశ్వరూప సందర్శన యోగం. భగవంతుని శక్తిని జ్ఞానాన్ని అక్షరస్వరూపాన్ని సాకారోపాశన నుండి నిరాకారానికి మలుపుతిప్పడం భక్తియోగం.

మనస్సును, బుద్ధిని, భగవంతునిపై నిలిపి క్షేత్రజ్ఞుడు నశించే క్షేత్రస్వరూపాన్ని ఎరిగి జీవబ్రహ్మైక్యంతో అనుభూతి పొందడం క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగం. కార్యకారణ సంబంధంతో మార్పులు చెందే త్రిగుణాల వికారాల వ్యామోహాల నుండి బయటపడి తరించడం గుణత్రయ విభాగ యోగం. శాశ్వతమైన ధర్మము పరబ్రహ్మమనే జ్ఞానోదయంతో గుణాతీతానికి ఆధారం శాశ్వతధర్మమని ఎరుక పురుషోత్తమ ప్రాప్తయోగం. పురుషోత్తముడే జీవులకు ఆధారభూతము అన్న ఎరుకతో తరించడం పురుషోత్తమ ప్రాప్తి యోగం. జీవుడికి భగవంతుడికి మధ్యవున్న సూక్ష్మతెరను తొలగించుకోవడానికి అసుర సంపదను తొలగించడం, దైవీ సంపదను ఆసరా చేసుకొని తరించండం దైవాసరసంపద్విభాగ యోగం. జీవుడు నేననే పరిమిత భావాన్ని త్రోసిపుచ్చి ఈ సృష్టికి ఆధారభూతమైన పరమాత్మ భావాన్ని శ్రద్ధాభక్తులతో ఆకళింపుచేసుకొని, అనాయాసంగా తరించడం శ్రద్ధాత్రయ విభాగ యోగం. అన్ని పరిమితులతో అహంకారం దాటి ఇహలోక సుఖాల స్పృహను కోల్పోగా మిగిలిన అనంతమైన పరమాత్మతో రమించడం మోక్ష సన్యాస యోగం.

గీతలో అన్ని అధ్యాయాలకు యోగాన్ని ప్రతిపాదించడం యోగాఆవశ్యకతను తెలుపుతుంది. అంటే జీవితానికి సంశయ విచ్ఛేదకంగా, దుఃఖ నివారకంగా, మార్గ నిర్దేశకంగా ఉపయోగపడే యోగాన్ని ప్రతిపాదించే సందేశం. అందువలనే అన్ని అధ్యాయాల పేర్లు యోగంతో ముగియడమేకాక, అనేక శ్లోకాల్లో యోగాన్ని గురించిన ప్రస్తావన జరిగింది.

- యోగస్థః కురు కర్మాణి ..... సమత్వం యోగ ఉచ్యతే (2-48)
- ...యోగః కర్మ సుకౌశలం (2-50)
- యోగ యుక్తో విశుద్ధాత్మా విజితాత్మ జితేంద్రియః ... (5-7)
- ... ఈక్షతే యోగ యుక్తాత్మా సర్వత్ర సమదర్శనః (6-29)
- ... యుక్తస్వ ప్నావ బోధస్య యోగోభవతి దుఃఖహా (6-17)
- ....యోగక్షేమం వహామ్యహం. (9-22)
- ...యత్ర యోగేశ్వరః క్రిష్ణో పార్థో ధనుర్దరః... (18-78)

చతుర్థ అధ్యాయం
జీవుని సాధన

మానవ 'సమస్యను' అర్థంచేసుకుని, గీతా 'సమాధానాన్ని' అందిపుచ్చు కొన్నప్పుడు, వాటికి పరిష్కారాలను ఆచరణలో పెట్టడం 'సాధన'. అయితే శరీరం మనస్సు బుద్ధి అహంకారం చిత్తం ఇంద్రియ కూటమి, మానవుడిని అసత్యం నుండి సత్యంవైపు, అధర్మం నుండి ధర్మంవైపు, దుఃఖం నుండి ఆనందం వైపుకు మరలకుండా వుండేందుకు యుద్ధాలు చేస్తుంటాయి. సత్వం మీద రజస్సు తమస్సు, చెడ్డ మీద మంచి, దైవీ సంపద మీద రాక్షస గుణాలు యుద్ధం చేస్తాయి. వీటికి అతీతమై, స్థితప్రజ్ఞత్వం, యజ్ఞం, వైరాగ్యం, ధ్యానం, తపస్సు, త్యాగాలను సాధనాలుగా చేసుకొని అభ్యాసం చేస్తే యోగం సిద్ధిస్తుంది. అట్టివారు ఈ సంసార చిక్కుల నుండి బయటపడి నిర్మలమై, ముక్తికి మోక్షానికి అర్హులై బ్రహ్మపదాన్ని పొందగలరు. అంతటితో జీవుడు పరమాత్మలో కలసి తనలో ఈ ప్రపంచాన్ని ఇముడ్చుకొని, తాను ఈ ప్రపంచంలో ఇమిడిపోయి దివ్యానుభూతితో, పరమానందంతో బ్రహ్మంలో రమిస్తాడు. దానికి కోరికలను ధర్మబద్ధంగా తీర్చుకుంటూ, భయాన్ని అభయంతో యుద్ధంచేస్తూ దుఃఖాన్ని యోగంగా పరివర్తన చేయడం సాధన. దీనికి కర్మ, భక్తి, జ్ఞాన, వైరాగ్యముల సాధనాసంపత్తిని సంపాదించుకొని గురువు ఆశీర్వాదంతో గీతలోని మూడు నుండి పదునెనిమిది అధ్యాయాల లలో వెలిబుచ్చాడు. ఈ విషయాన్ని సంగ్రహంగా క్రింద పొందుపరచ బడింది.

1. కర్మ

శ్రీకృష్ణుడు గీతలోని రెండవ అధ్యాయంలో దుఃఖాన్ని జయించే దానికి నివారణోపాయంగా, దుఃఖించ తగని వాటిని గురించి

దుఃఖించడం అవివేకమని చెబుతూ ఈ శరీరంలో కౌమారం, యవ్వనం, వార్ధక్యం తరువాత మరణం, తదనంతరం మరొక శరీరాన్ని స్వీకరించడం సహజం అని వచించాడు. శరీరం అశాశ్వతం, ఆత్మ నిత్యం, సర్వవ్యాప్తం, శాశ్వతం, జ్ఞానేంద్రియాతీతం. పుట్టినవాడు మరణించక తప్పదు. మరణించిన వాడికి పుట్టుక తప్పదు. అందువలన పుట్టుకను, మరణాన్ని గురించి ఆలోచించవలసిన అగత్యం లేదు. ఆత్మకు చావులేదు. అందుకని దుఃఖించనవసరం లేదు. కాని ఈ జన్మలో అందిన సదవకాశాన్ని సామాజిక విభజన (బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య శూద్ర) ద్వారా ఆచరించవలసిన విద్యుక్త ధర్మాన్ని నిర్వర్తించకపోతే అపకీర్తి పాలై చెడ్డపేరు తెచ్చుకొని పాపాన్ని మూట కట్టుకొని వీరుడన్న ప్రఖ్యాతిని పోగొట్టుకుని, పదిమందిలో చులకన కావటం కంటే దుఃఖం వేరే ఉండదు. కాబట్టి తన క్షత్రియ ధర్మాన్ని ఆచరించమని బోధిస్తాడు శ్రీకృష్ణుడు.

అంటే యుద్ధం చేసి పొందే దుఃఖానికంటే చెయ్యకుండా వచ్చే దుఃఖం మిన్న అన్న సత్యాన్ని పరిగణలోకి తీసుకుని, సుఖదుఃఖాలు, లాభనష్టాలు, జయాపజయాలు సమానంగా భావిస్తే, యుద్ధం చేయడం నిష్కామ కర్మ అవుతుంది. అలాంటి కర్మ, దుఃఖం నుండి, సంసార భయం నుండి కాపాడుతుంది. అలాంటికర్మ చేయడానికి స్థిర సంకల్పం కావాలి. అలాగే నిత్యజీవితంలో తమ తమ ధర్మాలను, ఆచరించని వారికి ఈ సంసారంలో కలిగే దుఃఖానికంటే మిన్నగా వుంటుంది. అనగా, ధర్మచ్యుతులకు సుఖం కంటే దుఃఖం మెండుగా వుంటుంది.

ఇలాంటి అవస్థ జీవితంలో ప్రతివ్యక్తికి తారస పడుతుంది. అనగా స్థిర సంకల్పంతో కర్మ చేసినపుడు దుఃఖం కలుగుతుంది. స్థిర సంకల్పంతో కర్మ చెయ్యకపోయినా దుఃఖం కలుగుతుంది. కర్మ చేయడం

వలన కలిగి దుఃఖం కంటే కర్మ చేయకుండా కలిగే దుఃఖం ఘోరమైనది. అంతేకాక కర్మను కర్మగా చూచి తామరాకుపై నీటిబొట్టులా కర్త కర్మ నుండి విడదీయబడి, కర్త, కర్మఫలాన్ని ఆశించకుండా, శ్రద్ధతో భక్తితో కర్మలనుండి తప్పించుకునే ప్రయత్నం చేయకుండా, సమభావనతో, సమదృష్టితో చేసిన కర్మను యోగం అంటారు. అపుడు దుఃఖానికి తావులేదు. స్వధర్మాన్ని నిష్కామ కర్మతో, కౌశల్యంతో ఆచరించినపుడు జన్మ బంధాలను తప్పించుకుని మోక్షాన్ని సాధించేందుకు అర్హతను సంపాదించుకోవచ్చు.

అపుడు జీవులు ఆత్మానందాన్ని పొంది స్థిత ప్రజ్ఞత్వం సాధించ గలరు. అనగా దుఃఖానికి కృంగక సుఖానికి పొంగక, భయము రాగము ద్వేషము త్యజించినపుడు, స్థితప్రజ్ఞత్వం పొందవచ్చు.

మూడవ అధ్యాయం ఐదవ శ్లోకంలో కర్మలు చేయకుండా ఎవడూ ఒక క్షణం కూడా ఉండడు. ప్రకృతి గుణాల ప్రభావాలకు లోనై ప్రతి వాళ్ళు అస్వతంత్రులై కర్మలను చేస్తూ ఉంటారు. అందుకని ఐదవ అధ్యాయం మొత్తం సంకల్పబలంతో స్వధర్మాన్ని ఆచరించిన వాడు మోక్షానికి అర్హుడవుతాడని, దుఃఖం నుండి విముక్తుడవుతాడని, ఆత్మ జ్ఞానాన్ని తెలుసుకుంటాడని చెప్పబడింది. అనగా స్వధర్మాచరణంతో ధర్మచ్యుతివలన కలిగే కోరికలను, భయాన్ని, దుఃఖాన్ని, నిష్కామకర్మతో దునమడం ఒక యుద్ధం, ఒక ధర్మం, ఒక యోగం.

నిత్యజీవితంలో మానవులు స్వబుద్ధితో స్వతంత్రంగా స్వధర్మాన్ని స్వీకరిస్తే, దుఃఖాన్ని సుఖంగా మార్చుకునే దానికి అవకాశం ఉంటుంది. అలాకాక మనం కర్మను చేయడమా, కర్మ మనల్ని నడిపించడమా అనేది సంధిగ్ధం. ఇంద్రియాలకు లోనై స్వధర్మాన్ని మరచి చేయతగని కర్మలను చేస్తే ఘోర ధుఃఖానికి లోనై తనను తాను తెలుసుకోలేక

ఇతరులను అపార్థం చేసుకుని జీవితాన్ని నరకప్రాయం చేసుకునే స్థితిని చేరుకుంటాడని కర్మయోగం యొక్క సారాంశం. అందువలన కర్మ చెయ్యకుండా జీవయాత్ర సాగించడం, సంసార బంధాన్ని కలుగజేసే కర్మలను ఆచరించడం, దైవప్రీతి కోసం కర్మలను ఆచరించకపోవడం, అనగా యజ్ఞయాగాలతో దేవతలను సంతృప్తి పరచకపోవడం వలన మానవులు పాపాలనుండి విముక్తి పొందలేక సద్గతిని పొందలేరు.

గుణ కర్మలు : సమాజం ఒకరిని చూసి మరొకరు ప్రకృతి గుణాలతో మాధులుగా గుణకర్మలలోనే ఆసక్తి చూపుతారు. అలాంటి వాళ్ళను అనుసరించేవాళ్ళు మరికొందరు ఉంటారు. మరి కొందరు స్వధర్మాచరణలో జీవితాన్ని అంకితం చెయ్యడానికి కూడా వెను దియ్యరు (3.35). అలాంటి ఉత్తములు చేసిన పనిని ఇతరులు కూడా అనుకరిస్తారు. ఆ ప్రమాణాలను లోకం అనుసరిస్తుంది. తద్వారా మానవులు నిష్కామ కర్మతో ధర్మ ఫలితాలను ఇతరులతో పంచుకుని అసూయ, క్రోధం, కోపం మాత్సర్యం లేకుండా ఆత్మజ్ఞానంతో ఇంద్రియాలను తమ అధీనంలో ఉంచుకొని మోక్ష పదాన్ని చేరుతారు.

నిష్కామకర్మ సన్యాసం

నిష్కామ కర్మ చేయడానికి కామమే అడ్డు వస్తుందనీ తనలో ఉన్న భగవంతుని స్వరూపాన్ని తెలుసుకుని కామాన్ని జయించడం అవసరం అని కృష్ణుడు వచించినది జ్ఞానకర్మ సన్యాస యోగం అంతరార్థం. సకామ కర్మ ద్వారా కలిగిన ఫలితం బంధనం అవుతుంది. నిష్కామకర్మ ఫలితం యోగం అవుతుంది. అందుచేత జ్ఞానంతో కర్మ ద్వారా కర్మ ఫలబంధనాన్ని వదిలించుకోగలగడం వీలవుతుంది. జ్ఞానం ద్వారా ఈ లోకంలో ధర్మం అధోగతిపాలై అధర్మం ప్రబలినపుడు భగవంతుడు అవతరించి సజ్జన సంరక్షణ, దుర్జన సంహారం, ధర్మ సంస్థాపన చేస్తాడన్న

సత్యాన్ని, ప్రకృతి రహస్యాన్ని చేదించడమే, తెలుసుకో గలగడం (4.7, 8).

జ్ఞానం ద్వారా భగవంతుని ఎవరు ఎలా ఆరాధిస్తే వాళ్ళను అలాగే అనుగ్రహిస్తాడు అన్న అంతరార్థం తెలియ చేయబడుతుంది. అలాగే ఏది కర్మో, ఏది కర్మ కాదో, ఏది కర్మో, ఏది అకర్మో, ఏది కర్మలో అకర్మో, ఏది అకర్మలో కర్మో అన్న విషయాలను జ్ఞానం తెలియజేస్తుంది. ఫలాపేక్ష లేకుండా కర్మలు ఆచరించడంతో, పూర్వపు వాసలను జ్ఞానం అనే అగ్నితో దగ్నం చేయడంతో మానవులు పాపం పొందరు. సుఖ దుఃఖాలకు లొంగనివాడు. జయాపజయాల పట్ల సమదృష్టి కలిగిన వాడు బంధాల్లో చిక్కుకోడు. అతను స్థిత ప్రజ్ఞుడు. జ్ఞానం, యజ్ఞం, యజ్ఞ సాధనాలు, ద్రవ్యాలు, కర్త, కర్మ, అన్నీ పరబ్రహ్మమని తెలుసు కుంటాడు (4.19, 22).

యజ్ఞం

ఇహపర సుఖానికి ఏదో ఒక యజ్ఞాన్ని వేదంలో విశదీకరించిన విధంగా చేయడం ఉత్తమం. యజ్ఞం అనగా హోమాగ్నిలో హోమద్రవ్యాలు అర్పణం చేయడం. అలాగే బ్రహ్మమనే అగ్నిలో ఆత్మను ఆహుతి చేయటం కూడా యజ్ఞమే. అలాగే ఇంద్రియాలను నియంత్రించి నిగ్రహం అనే అగ్నిలో ఆహుతి చేయడం మరొక యజ్ఞం. కొందరు ఇంద్రియాలను జ్ఞానం అనే అగ్నిలో దగ్ధం చేయడం జరుగుతుంది. దాన ధర్మాలు, తపస్సు, యోగసాధన, కార్యదీక్ష, కఠోర వ్రతములను వేదాధ్యయనం, స్వాధ్యాయం లాంటి జ్ఞాన యజ్ఞములు చేస్తున్నారు.

జ్ఞానాగ్ని, సర్వకర్మలను భస్మం చేస్తుంది. అజ్ఞానం, అశ్రద్ధ, అనుమానం, సందేహాలతో జీవించేవాడికి, ఇహలోకంలో కూడా సుఖ సంతోషాలు ఉండవు. నిష్కామ కర్మయోగం వల్ల కర్మఫలాలు విడిచిపెట్టి,

జ్ఞానంతో సంశయాలు పోగొట్టుకున్న ఆత్మజ్ఞానానిని కర్మలు బంధించలేవు (4-41).

యజ్ఞం అనగా త్యాగం. త్యాగం అనగా కర్మ. కర్మ వలన ఫలితం కలుగుతుంది. ఫలితాలను అందరితో పంచుకోవడం మరో యజ్ఞం అవుతుంది. అంటే త్యాగం అవుతుంది. ఈ పరంపరలో జీవిత చక్రాన్ని నడపనివాడు ఇంద్రియలోలుడై వ్యర్థ జీవితాన్ని గడుపుతాడు. సంతృప్తి సంతోషం లేక, స్వార్థ బుద్ధితో దుఃఖాన్ని ఇనుమడింప చేసు కుంటాడు. లోక క్షేమానికి సత్కర్మలు చేయడం విస్మరిస్తాడు. మోక్షానికి దూరం అవుతాడు.

కర్మ సన్యాసం

కర్మత్యాగం, కర్మయోగం రెండూ మోక్షం కలుగజేస్తాయి. అందులో నిష్కామ కర్మయోగం వేరు. ద్వేషం, కోరిక లేనివాడు నిత్య సన్యాసి. జ్ఞానము, కర్మ వేరు కావు. తనను ఇతరులలో చూచుకొని, ఇతరులలో తనను చూచుకునే వారు పరమాత్మ తత్వం తెలిసిన కర్మయోగులు. వారు ఇంద్రియాల కార్యక్రమాలకు సాక్షిభూతులు అవుతారు. అందు వలన ఇంద్రియ నిగ్రహంతో, నిష్కామకర్మ యోగిగా నిశ్చల మనస్సుతో, సమభావంతో, సందర్శించిన వారు, సంసార బంధాన్ని అనుభవించి, ఆత్మానందాన్ని అనుభవిస్తారు. కామ క్రోధాలను విడిచి పెట్టి మనో నిగ్రహంతో ఆత్మతో రమించేవారు బ్రహ్మానందం పొందుతారు. ఇది మనస్సును నిగ్రహించడం ద్వారా వీలు అవుతుంది. కామాన్ని నిష్కామ కర్మ ద్వారా యుద్ధంచేసి జయించాలి. అధర్మాన్ని ధర్మం ద్వారా పరిహరించాలి. ఇంద్రియ కార్యక్రమాలకు సాక్షిభూతంగా నిలబడాలి. ఇవన్నీ ఆత్మశుద్ధికి మానవుడు చేసే యుద్ధాలే.

ఆత్మ సంయమం

ఇంద్రియ విషయాల మీద అవాంఛ, నిష్కామ కర్మ యోగానికి పరాకాష్ఠ. దీనికి మనస్సు ప్రధానం. అయితే, తన మనస్సే తనకు బంధువు, శత్రువు కూడా తనను తాను ఉద్ధరించుకోవడానికి ఆత్మను అధోగతి పాలుచేయకుండా ఉండడానికి మనస్సును స్వాధీన పరుచుకోవాలి (6.5, 6). యోగి సమదృష్టి కలిగి ఉంటాడు (6.7, 8). దీనికి ఇంద్రియాలను మనస్సును స్వాధీన పరుచుకుని ఏకాగ్ర చిత్తంతో ఆత్మ శుద్ధి కోసం యోగాభ్యాసం చెయ్యాలి (6.12, 13, 14). ఆహార నియమాలు, నిద్రలో, మెలకువలో, మెలకువతో పరిణతి పాటించడం యోగసిద్ధికి మూలం (6.16, 17).

దీనికి మనస్సును వశపరచుకోవడం మినహా మార్గం లేదు. యోగాభ్యాసం వల్ల మనస్సు నిగ్రహించడం శాంతిని పొంది పరమాత్మను సందర్శించి ఇంద్రియాతీతమైన అనంత సుఖాన్ని అనుభవించడం యోగం (21, 22, 23). యోగ సిద్ధి పొందిన వాడు సమస్త భూతాల పట్ల సమభావం కలిగి అన్నిభూతాల్లో తన ఆత్మను సర్వభూతాలను అలాగే భగవంతున్ని సందర్శిస్తాడు (6.30, 29, 30, 31). మనస్సు చంచలం కావున, వైరాగ్యాన్ని అభ్యాసం చేయడంవలన మనస్సును వశపరుచుకోవచ్చు(6.35).

మంచిపనులు చేసిన మానవుడు ఎవడూ, ఎప్పుడూ దుర్గతి పొందడు (6.40). పైగా ఆ కారణంగా మంచి పునర్జన్మను పొందగలడు. అర్జునా! తపస్సు చేసేవాళ్ళ కంటే శాస్త్రజ్ఞానం కలవాళ్ళ కంటే, యోగుల కంటే ధ్యానయోగి గొప్పవాడు (6.64). మనస్సును స్వాధీన పర్చుకొని ఇంద్రియాలను నిగ్రహించి సమదృష్టితో ఆత్మశుద్ధికోసం చేసే యోగా భ్యాసం కూడా ఒక యుద్ధమే. ఆ యుద్ధమే యోగం.

2. భక్తి

జ్ఞానవిజ్ఞానం

భగవానుడు భక్తిని గురించి, "భగవంతుని మాయా శక్తి 8 విధాలుగా విభజించబడినది. అవి! భూమి, నీరు, అగ్ని, గాలి, ఆకాశం, మనస్సు, బుద్ధి, అహంకారం. ఏ భక్తుడు ఏ దేవతామూర్తిని భక్తితో పూజించ కోరుతున్నాడో అతనిని ఆ దేవతామూర్తిపట్ల అచంచలమైన శ్రద్ధను నేను కలుగజేస్తాను. అశ్రద్ధా భక్తులతో కామితీర్థాలను ఆ దేవత ద్వారా పొందగలడు" అని అన్నాడు (7.27, 28). జ్ఞానాన్ని, విజ్ఞానాన్ని వివరించుకొని వితరణతో మాయను ఛేధించడం ఒక యుద్ధం. శ్రద్ధతో చేసే ప్రతిపనిని ఒక యుద్ధంగా చూచినపుడు అది జయాన్ని సంతరించు కుంటుంది. అది యోగం అవుతుంది.

అక్షర పరబ్రహ్మం

సర్వోత్తమము శాశ్వతము అయిన పరమాత్మ బ్రహ్మం. ఆత్మయొక్క పరమాత్మ తత్వాన్ని అధ్యాత్మికతత్త్వమని చెప్పబడుతుంది. అది శాశ్వతము. నశించేవి ఆది భూతం. మంచి ఆలోచనలతో కూడిన మనస్సును భగవంతునికి అర్పించి మరణిస్తే సద్గతిని పొందుతారు. ఇంద్రియాలన్నింటిని నిగ్రహించి, మనస్సును హృదయంలో నిలిపి, ప్రాణం శిరస్సులో ఉంచి, ఆత్మయోగం అభ్యసిస్తూ, బ్రహ్మను ప్రతిపాదించి 'ఓంకారం' ఉచ్ఛిరిస్తూ, భగవంతుని స్మరిస్తూ, శరీరాన్ని విడిచిపెట్టేవాడు మోక్షం పొందుతాడు. మోక్షం సాధించేందుకు ఆత్మయోగం, ఓంకార ఉచ్ఛరణ ద్వారా, నిష్కామకర్మలతో చేసే యుద్ధం యోగం అవుతుంది.

రాజవిద్య రాజ గుహ్యం

సంసారం అశుభకరం. మరణ రూపం. బ్రహ్మ జ్ఞానం ఉత్తమం. సంసారంలో ఉండి అతీంద్రియ తత్వంతో బ్రహ్మ జ్ఞానం సాధించి తటస్తుడు కావడం వలన, సంసార బంధం నుండి తప్పించుకుని, వివేకంతో మోక్షాన్ని సాధిస్తాడు. లేని యెడల పనికిమాలిన కాంక్షలు, కర్మలూ, జ్ఞానమూ కలిగి వివేకము కోల్పోయి రాక్షస స్వభావాన్ని ఆశ్రయిస్తాడు.

ఈ జగత్తుకు తల్లి, తండ్రి, కర్మఫల దాత, ఓంకారం, వేదాలు, ఆ పరమాత్మే (9-17). పరమాత్మ మీది ఏకాగ్రతతో సంసారబంధం మీద యుద్ధంచేసి బ్రహ్మజ్ఞానాన్ని సాధించవచ్చు. ఏకాగ్ర చిత్తంతో నిరంతరం ఆ పరమాత్మను స్మరిస్తూ సేవించే వాళ్ళ యోగక్షేమాలు భగవంతుడు చూచుకుంటాడు (9.22). జీవులు పరిశుద్ధమైన మనస్సుతో ఆకు, పువ్వు, పండు, నీరు సమర్పించినా భగవంతుడు సంతోషంతో వాటిని స్వీకరించి వారిని అనుగ్రహిస్తాడు.

భగవద్గీత సారాంశము మనస్సును నిగ్రహించి, ఈ దృశ్యమాన ప్రపంచం యొక్క అశాశ్వత తత్వాన్ని పరమాత్మ యొక్క శాశ్వత తత్వాన్ని వివరించి, మంచి ప్రవృత్తిని, మంచి కర్మలను, యజ్ఞయాగాదులను చేస్తూ తనను తాను అర్థం చేసుకుని, తనను తాను ఉద్ధరించుకునే శక్తిని సాధించి, మనుగడ సాగిస్తే, భగవంతుని సృష్టి లక్ష్యం నెరవేరుతుంది.

భగవద్గీతలో శ్రీకృష్ణుడు శరీరానికి మానవుడు చూపించే శ్రద్ధ మనస్సుకు కూడా చూపించాలని వచించాడు. ఇంద్రియ నిగ్రహం ద్వారా,

అభ్యాస వైరాగ్యాల ద్వారా, మనస్సును అదుపులో పెట్టుకుని, కర్మను జ్ఞానాన్ని అంటే మనస్సును శరీరాన్ని, ఒకే తాటిపై నడిపిస్తే యోగి అవుతాడు. అదే యోగం. ఆత్మ సాక్షాత్కారం. అలాకాకుండా మనస్సును కేవలం ఇంద్రియాలను సంతృప్తి పరచడంలో నిమగ్నం చేస్తే ఫలితం తాను తన కుటుంబం, సమాజం ముక్కలు చెక్కలు అవుతుంది. అందుచేత, మనస్సుకు శరీరానికి మధ్య, కర్మకు జ్ఞానానికి మధ్య, ఉన్న గీతను తుడిచి వేసి వాటిని ఒకటి చేసి యోగాన్ని సాధించి, యోగిగా ఆత్మను పరమాత్మలో లయమైపోయే తత్త్వాన్ని అనుసరించడం ఉత్తమం. మనస్సును నిగ్రహించి మంచికర్మల ద్వారా, అశ్వాశ్వతమైన వాటిపై వైరాగ్యాన్ని అభ్యాసం చేసి ఆత్మ సాక్షాత్కారాన్ని పొంది, శాశ్వతమైన మోక్షపదాన్ని సంపాదించడం ఒక యుద్ధం. ఒక యోగం.

విభూతి యోగం

బుద్ధి, జ్ఞానం, మోహం లేకపోవడం, సహనం, సత్యం, ఇంద్రియ నిగ్రహం, సుఖం దుఃఖం, జననం మరణం, భయం నిర్భయం, అహింస హింస, తపస్సు, దానం, కీర్తి, అపకీర్తి లాంటి భావాలు ప్రాణులకు వాటి వాటి కర్మాను సారమే కలుగుతాయి. ఈ సృష్టి స్థితిలయములు అంతా భగవంతుని ప్రతిరూపాలు. సృష్టిలోని ఉత్తమోత్తమమైన వస్తువులు, పదార్థములు, సంఘటనలు, భావాలు, జ్ఞానం, అక్షరక్షరములు, అల్ప నీచ విషయములు, అంతా భగవత్స్వరూపమే. ఈ చరాచర స్వరూపంలో భగవంతునిది కానిది ఏమి లేదు. కాబట్టి అలాంటి జ్ఞానంతో చలించే వ్యక్తి తనను తాను ఉద్ధరించుకొని ఇతరులను ఉద్ధరించుకోగలడు. జ్ఞానంతో కర్మానుసారాన్ని, భగవంతుని స్వరూపాన్ని అర్థంచేసుకొని తనను, ఇతరులను, ఉద్ధరించి విభూతి (ఐశ్వర్యం సంపదను) సాధించడం యుద్ధమే.

విశ్వరూపం సందర్శనం

విశ్వరూప సందర్శనం, చరాచర జగత్తును, బ్రహ్మను, ఋషులను, అనంత రూపాన్ని, ఆది మధ్యాంతములేని తత్వాన్ని తెలియజేసినపుడు ఈ మహావిశ్వంలో అణువులో అణువైన, పరమాణువులో పరమాణువైన, మానవ జీవితం, జ్ఞానం, ఆవేశం, ఆవేదన లాంటి ఈవలి ఆవలి గట్టులను, అనుభవించి దర్శించితే అర్థం అవుతుంది. విశ్వరూప సందర్శనం, అర్జునుడి ద్వారా ప్రతి మానవునికి ఈ అనంతవిశ్వంలో, అనంతకాలంలో, తన ఉనికి ఎంత అల్పమైనదో అన్న జ్ఞానోదయం కలుగుతుంది. తద్వారా తాను, తన కర్తవ్య విధిని సక్రమంగా నిర్వర్తించి, ఇహపర సుఖాలకు అర్హత సంపాదించడం చాలా సులభమవుతుంది. అట్లు చేయని వ్యక్తి ఈ జీవితంలో అల్పమైన వాంచలకు లోనై అదే నిత్యము సత్యము అనుకొని, తనకు ఇతరులకు కూడా ఉపయోగం లేని, గుర్తింపులేని, సభ్యతా సంస్కారం లేని జీవితం గడపడం జరుగు తుంది. ఈ దర్శనం ఒక యోగం.

భక్తి యోగం

ఇంద్రియాలనింటిని బాగా వశపరచుకొని, సర్వదా సమభావన కలిగి, సమస్తజీవులకు మేలుచేయడం ద్వారా సంతోషం పొందుతూ, నాశరహితము, అనిర్వచనీయము, సర్వవ్యాప్తము ఊహాతీతము, నిర్వికారము, నిశ్చలము, నిత్యము అయిన ఆత్మస్వరూపాన్ని ఉపాసించేవాళ్ళు భగవంతుని చేరుతారు. శరీరాభిమానానికి అంటి పెట్టుకోకుండా సమస్త కర్మలను భగవంతునికి అర్పిస్తే సంసార బంధాలనుండి ఉద్ధరింపబడుతారు (12-2-7).

అవివేకంతో కూడిన అభ్యాసం కంటే జ్ఞానంమేలు. జ్ఞానం కంటే ధ్యానం ఉత్తమం. ధ్యానం కంటే కర్మఫల త్యాగం మంచిది. అలాంటి

త్యాగం వలన మనశ్శాంతి కలుగుతుంది (12.12). దేని మీద కోరికలు లేక, పవిత్రంగా కార్యదక్షతతో పక్షపాతం లేకుండా చీకుచింతా పడకుండా, ఆడంబరాన్ని వదలి, కర్మ చేయువాడు భగవంతునకి ప్రీతి పాత్రుడు. ద్వంద్వాతీతులు భగవంతునికి ఇష్టులు (15–19). అలాంటి ప్రీతి ఒక యోగం.

3. జ్ఞానం

క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగం

ఈ శరీరం క్షేత్రం. పంచభూతాలు, అహంకారం, బుద్ధి, మూల ప్రకృతి, పది ఇంద్రియాలు, మనస్సు, ఐదు ఇంద్రియ విషయాలు, కోరిక, ద్వేషం, సుఖ దుఃఖం, ధైర్యం, వికారాల సముదాయాన్ని క్షేత్రం అంటారు. దీన్ని తెలుసుకున్న వాడు క్షేత్రజ్ఞుడు. మానవుడు ఇంద్రియాలకు లోబడకుండా, విషయాలలో ఇమడకుండా, తత్త్వజ్ఞానం వలన కలిగే ప్రయోజనాన్ని గ్రహించడం జ్ఞానం. దీనికి విరుద్ధమైనది అజ్ఞానమని తెలుసుకొని, పరబ్రహ్మం సర్వస్వం అని తెలుసుకుంటే మానవుడు మోక్షం పొందుతాడు.

బ్రహ్మం సర్వ ప్రాణులను సృజిస్తుంది. పోషిస్తుంది, ప్రకాశింప జేస్తుంది, భుజిస్తుంది. వెలుపల లోపల కూడా ఉండి, కదలి కదలని అతి సూక్ష్మ స్వరూపం అయిన దానిని తెలుసుకోవడం బ్రహ్మ జ్ఞానం. అలాంటి జ్ఞానం ఉన్నదన్న స్పృహ నిత్యజీవితంలో మనిషిని తప్పునుండి మరల్చి, చెడ్డను దూరంగా ఉంచి, సంస్కారమైన జీవితాన్ని గడిపి, సంతోషాతిశయంతో, తనను తాను సంతోషపెట్టుకుని ఇతరులను సంతోషపెట్టి, తనను తాను ఉద్ధరించుకొని, ఇతరులను ఉద్ధరించి, సమాజంలో ఒక క్రమ శిక్షణకు, ధర్మానికి నాంది పలికి, క్షేమానికి

శ్రీకారం చుట్టి, సమతౌల్యాన్ని ప్రకృతిలో ఆవిష్కరించడానికి ఉపయోగ పడుతుంది.

జీవితం చాలా చిన్నది. కాని అనుభవం చాలా పెద్దది. జీవితాన్ని మరచి అనుభవాన్ని అతీతంగా చూస్తే దుఃఖానికి రహదారి వేసి, సుఖం చుట్టూ ప్రహరి గొడకట్టి, అదే నిత్యము సత్యము అనుకొని జీవుడు భ్రమలో లక్ష్యంలేని జీవితాన్ని గడపవలసి వస్తుంది.

అందువలన 'ధ్యాన యోగం ద్వారా కొంతమంది, జ్ఞాన యోగం వలన మరికొంతమంది, కర్మయోగంతో ఇంకొంతమంది, పరమాత్మను తమలో దర్శిస్తారు' (13.25).

జీవులు తమ తమ శారీరక మానసిక స్థితిగతుల బట్టి ఎవరికి తోచిన పద్ధతులలో వారు నిత్యజీవితంలో తాము సుఖించి ఇతరులను సుఖింపజేసి లేదా ఇతరుల సుఖానికి అడ్డు తగలకుండా ఉండడం అనేది పరమాత్మ తత్వం అవుతుంది. ఈ ఆత్మ సత్యాన్ని తెలుసుకున్న వ్యక్తి పరిపూర్ణ స్వరూపుడై, చిదానంద మయుడై బతికిన నాలుగు దినములు తృప్తి సౌఖ్యము, శాంతి, ఆనందాలతో నిండి పరిమాణువు అంతటి జీవితాన్ని, ఒక మహన్వితమైన ముద్రను కాలగతి మీద ముద్రించి, రాబోయే తరాలకు ధర్మకర్తుత్వం వహించి, ఆదర్శవంతుడై చరిత్రలో గణుతుకెక్కిన శ్రీకృష్ణ, శంకర రామానుజుల్లా నిలచి పోతారు.

ఈ ప్రకృతిలో నుండి సమస్థ కర్మలు ఉద్భవించి మరలా ప్రకృతిలో లీనమైపోవడమే జీవిత పరిణామ సత్యం. దీనికి పుట్టుక, పెరుగుదల, నశింపు రూపాలలో ప్రదర్శించబడుతుంది. ఈ పరిణామాన్ని, పరిణామ కార్య కారణాల ద్వంద్వాలకు, అతీతమైన వాడు, కర్మ ఫలాన్ని వదిలించుకొని, కలుషితం కాకుండా సూక్ష్మాతి సూక్ష్మంలో మహా మహితాత్మలో కలిసిపోవడాన్నే **పరమపదం** అంటాం. అది యోగం అవుతుంది.

గుణత్రయ విభాగం

నిత్యజీవితంలో సంసారం బంధాలు, బంధనాలు, బాధలు వీటిలో ఉంటూ వీటికి అతుక్కోకుండా ఉండటం కర్మ వల్ల, భక్తి వల్ల, జ్ఞానం వల్ల, ధ్యానం వల్ల, యోగం వల్ల వీలవుతుంది. శరీరాన్ని మనస్సును శాసించేవి, సత్వ రజస్సు తమస్సు, అనే మూడు గుణాలు (14.5).

సత్వం, జ్ఞానం మీద ఆసక్తిని కలుగజేస్తుంది. రజస్సు ఆశకు మూలమవుతుంది. తమోగుణం అవివేకానికి దారితీస్తుంది.

నిత్యజీవితంలో రజోగుణాన్ని తమోగుణాన్ని నియంత్రణలో వుంచుకొని సత్వగుణాన్ని అభివృద్ధి పరచుకుని అభ్యాసము చేయువాడు తాను సుఖించి ఇతరులను సుఖింపజేస్తాడు. లేనియెడల రజోగుణ ఉద్రిక్తతతో, తమోగుణ అజ్ఞానంతో, తత్ఫలితమైన దుఃఖంతో సత్వానికి సమాధిచేసి, సమాజంలో అలజడిని ఆందోళను రేకెత్తించి, కక్షలతో, కార్పణ్యాలతో, సంసారాన్ని, యుద్ధభూమిగా, నరకప్రాయంగా చేస్తాడు.

భగవద్గీతలో ఆచరించతగిన, తగని పద్ధతులను, ద్వంద్వాలుగా ఆవిష్కరించారు. దుఃఖించ తగిన తగని, వాటిని గురించిన చర్చ, గుణాల దగ్గరకొచ్చేసరికి మూడుగా విభజింపబడ్డాయి. సాత్వికం, రాజసం, తామసం. ఈ సాత్విక, రాజసిక, తామసికాలను అనేక కర్మ, జ్ఞాన, భక్తి, తపస్సు, ఉపాసన, ధ్యానం, పూజ, ఆరాధన, ఆహారం, వ్యవహారాలకు జోడించారు. అంటే సాత్విక ఆలోచనల చర్యలు మానవుడికి దైవత్వాన్ని చేకూరుస్తుంది. రాజసం ఆలోచనలు, చర్యలు వున్న వ్యక్తులు దైవత్వానికి రాక్షసత్వానికి మధ్యలో నిలుస్తారు. తామసిక ఆలోచన చర్యలతో జీవులు రాక్షసత్వంలో బ్రతుకు సాగిస్తారు.

గుణాతీతుడు, ద్వంద్వాలకు అతీతమై, నిరంతరం ఆత్మావలోకనంలో నిమగ్నమై ఉంటాడు. నిత్యజీవితంలో అది అందరికి సాధ్యం కాదు. దీనిని జ్ఞానంతో, సత్వంతో యుద్ధం చేసి గెలుపొందాలి. ఈ గెలుపు ఒక యోగం.

పురుషోత్తమ ప్రాప్తి

జీవితంలో సంసారం యొక్క ధర్మ కర్మబంధం, సంసారంపై వైరాగ్యం, పునర్జన్మలు, మానవుని అధోగతిని లేదా సద్గతిని నిర్ణయిస్తాయి. పురుషోత్తమ శాశ్వతత్వానికి ప్రకృతిలోని జ్ఞానేంద్రియాలు, మనస్సులకు సంబంధించి గాలి పువ్వులనుంచి వాసనలను తీసుకుని పోయేటట్లుగా జీవులు శరీరాన్ని ధరించేటప్పుడు, ఇంద్రియాలను, మనస్సును వెంటపెట్టుకొని పోతారు. జీవుడు జ్ఞాన దృష్టిలేక జీవాత్మను చూడలేక, ఆత్మ సంస్కారంలేక అవివేకుడు అవుతాడు. జీవులు తమ దైనందిన కార్యక్రమాలన్నింటికి తామే రూపకర్తలమని తమవలననే జ్ఞాపకం, జ్ఞానం, మరపు, మార్పు కలుగుతుంటాయని అనుకుంటారు. కాని దీని వెనుక ఒక పురుషోత్తముడు ఉన్నాడని అతను సర్వజ్ఞుడని అతని ఆరాధన ద్వారా కైవల్యం ప్రాప్తిస్తుందని ఊహించని అవివేకాన్ని ఆత్మజ్ఞానంతో యుద్ధంచేసి తెలుసుకోవాలి. ఈ యుద్ధం ఒక యోగం.

యోగాన్ని సూక్ష్మంగా అర్థంచేసుకోవడానికి శుద్ధచైతన్య స్వరూపమైన ఆత్మ, బ్రహ్మల అభేదాన్ని క్షుణ్ణంగా అర్థంచేసుకోడానికి ప్రధానోపనిషత్తులలోని నాలుగు సుప్రసిద్ధ మహావాక్యాలను అర్థంచేసుకోవడం అవసరం.

1) ఛాందోగ్యోపనిషత్తులోని "**తత్త్వమసి**" (తత్ త్వమ్ అసి) అంటే – అది నీవే అయి వున్నావు Thou art that. నీకు, పరబ్రహ్మ పదార్థానికి తేడా లేదు.

2) బృహదారణ్యకోపనిషత్తులోని "**అహం బ్రహ్మోస్మి**" (అహం బ్రహ్మ అస్మి) అంటే "నేనే బ్రహ్మను అయి వున్నాను" I am Brahman. పరబ్రహ్మకు, జీవాత్మకు భేదం ఏమీ లేదని, రెండూ ఒకటేనని అర్థం.

3) మాండూక్యోపనిషత్తులోని "**అయమాత్మా బ్రహ్మ**" (అయం ఆత్మ బ్రహ్మ) ఈ ఆత్మయే పరబ్రహ్మ, This Atman is Brahman itself.

4) ఐతరేయోపనిషత్తులోని "**ప్రజ్ఞానమ్ బ్రహ్మ**" – Brahman is pure consciousness. ప్రతి మానవునిలో, జీవిలో వుండే స్వస్వరూపానికి సంబంధించిన ఎరుకయే బ్రహ్మ.

దైవాసుర సంపద్విభాగం

ప్రతి మానవుడిలో దైవత్వం, రాక్షసత్వం ఉంటాయి. దైవీ సంపదతో జన్మించిన వాడికి జ్ఞానం, దానం, ఇంద్రియ నిగ్రహం, యజ్ఞం, తపస్సు, అహింసా, సత్యం, శాంతి లాంటి సద్గుణాలు ఉంటాయి. రాక్షస సంతతిలో జనించిన వాడికి కపటం, గర్వం, దురహంకారం, కోపం, కఠినత్వం అవివేకం ఉంటాయి. దైవీ సంపద వలన మోక్షం, అసుర సంపదవలన సంసార బంధం కలుగుతాయి. మంచి గుణాలు కలవానికి ఏది చెయతగినదో, తగనిదో అన్న విచక్షణా జ్ఞానం రెండవ అధ్యాయంలో 11వ శ్లోకంలో వచించిన విధంగా ఉంటుంది. అసుర ప్రవృత్తి గలవారు విచక్షణను కోల్పోతారు. అలాంటి వారు నాస్తికులై, అల్ప బుద్ధులై, ఘోర కృత్యాలు చేసే కంటకులై, ఇతరుల నాశనానికి కారణభూతులవుతారు. వాళ్ళు అంతులేని కోరికలతో ఆడంబరం, గర్వం, దురభిమానంతో దురాచారులై జీవిస్తారు. వారు సంసారంలోని లంపటలో ఆశాపాశాల వలల్లో చిక్కుకొని, కామక్రోధా

లకు వసులై అల్పమైన జీవితాన్ని గడుపుతారు. వాళ్ళను అజ్ఞానం పాలిస్తుంది తద్వారా ఘోర నరకం పాలవుతారు.

అట్టివారు తమను చూసుకొని తామే పొంగిపోతుంటారు. వినయ విదేతలు లేకుండా, క్రమశిక్షణా రహితంగా, ధన మద గర్వంతో, శాస్త్ర విరుద్ధంగా పేరు కొరకు యజ్ఞం చేస్తారు (16.7). అలాంటి ద్వేష పూరితులు, పాప చరితులు, క్రూర స్వభావులు, సంసార బంధంలో ఇరుక్కుంటారు. కామం, క్రోధం, లోభం నరక ద్వారాలు. ఈ మూడు ఆత్మ వినాశనానికి కారణాలు. ఈ మూడింటిని విడిచిపెట్టిన వాడు ఉత్తముడై పరమ పదం పొందుతాడు (16.22,23). అందుకని వీటిని విడిచిపెట్టమని భగవానుడు ఉపదేశిస్తాడు. ఈ మూడు దుర్గుణాలు విడిచితే తమకు తామే పరమపదం పొందుతారు. లేనియెడల మృతిచెందే వరకు మితిలేని కామభోగాలను అనుభవించడం పరమావధిగా భావించి ఆశాపాశాల గూడులో చిక్కుకొని, కామ క్రోధాలకు, అక్రమ సంపాదనకు పూనుకుంటారు (16.12).

వీరికి అజ్ఞానం, కోరిక, కామం, భోగం మార్గదర్శక సూత్రాలుగా పనిచేసే కారణంగా, నరకానికి తమంతట తామే ద్వారాలు తెరుచు కుంటారు. తమను తామే పొగుడుకోవడం, వినయ విధేతలు లేకుండా పోవడం, ధనంతో గర్వించడం, ధన గర్వంతో ప్రవర్తించడం, శాస్త్ర విరుద్ధ పనులు చేయడం, భగవంతుడిని ద్వేషించడం, శాస్త్ర విరుద్ధ యాగాలు చేయడం వీరి వంతు (16.17).

శాస్త్రాన్ని విడిచిపెట్టి తన మేధస్సుకు ఇంద్రియాలకు సేవకుడై ప్రవర్తించేవాడు సుఖానికి, మోక్షానికి అనర్హుడు అవుతాడు. అందువలన చేయదగిన దేదో చేయకూడదని దేదో నిర్ణయించుకోవడంలో, శాస్త్రాన్ని ఆధారం చేసుకుని, శాస్త్రాన్ని ప్రమాణంగా చేసుకుని, కర్మలను చేసేవాడు

ఉత్తముడు (16.24,25). ఆత్మజ్ఞాని, విచక్షణా జ్ఞానంతో, దైవీ సంపదతో, రాక్షసత్వంపై యుద్ధంచేసి గెలుపొందితే అది యోగం.

శ్రద్ధాత్రయ విభాగం

మానవుడు తన స్వభావాన్ని బట్టి శ్రద్ధను అనుసరిస్తాడు. అది సత్వము, రాజసము, తామసము అని మూడు విధాలు. సాత్వికులు దేవతలను పూజిస్తారు. రాక్షసులు యక్షరాక్షసులను పూజిస్తారు. తామసులు భూత ప్రేతాలను పూజిస్తారు. మానవుని లోని, గుణములు తేడావలన ఆహారం, యజ్ఞం, జ్ఞానం కర్మ మారుతుంటాయి. శాస్త్ర సమ్మతమైన కర్తవ్యం తాత్విక యజ్ఞం అయితే, ఫలాన్ని ఆశించే ఆడంబరం కోసం చేసేది రాక్షస యజ్ఞం. అశాస్త్రీయంగా, అశ్రద్ధతో ఆచరించేది తామసిక యజ్ఞం అవుతుంది.

శరీరంతో చేసే తపస్సులో, బ్రహ్మచర్యం, అహింస, పవిత్రత, కల్లా కపటం లేకుండా ప్రవర్తించడం, దేవతలను బ్రాహ్మణులను, గురువులను, జ్ఞానులను పూజించడం, వేదాధ్యయనం చేయడాన్ని వాచక తపస్సు అంటారు. మనస్సును నిర్మలంగా ఉంచుకొని, మౌనంతో శాంత స్వభావము, ఆత్మ నిగ్రహం, అంతఃకరణ, శుద్ధి కలిగి ఉండడం మానసిక తపస్సు అవుతుంది.

ఫలా పేక్షలేని తపస్సు సాత్వికము, సత్కార సన్మానాల ఆడంబరం కోసం చేసే తపస్సు రాజసం అవుతాయి. తన శరీరానికి, ఇతరులకు బాధ కలిగించే తపస్సు తామసం అవుతుంది (17.17,19).

ప్రతి ఫలాపేక్షలేని దానం సాత్వికం. ఫలాన్ని ఆశించిన దానం రాజసం. అవమానకరంగా, అగౌరవంగా ఇచ్చేదానం తామసం (17.20, 122).

పరబ్రహ్మకు ఓం, తత్, సత్ అనేమూడు పేర్ల వలెనె బ్రాహ్మణులు, వేదాలు, యజ్ఞాలు సృష్టించబడ్డాయి. యజ్ఞాలకు, దానాలకు, తపస్సులకు 'ఓం' తో శ్రీకారం చుడతారు. మోక్షాపేక్షతో చేసే యజ్ఞాలు, దానాలు తపస్సులు తత్ అనే ఉచ్ఛారణతో ప్రారంభిస్తారు. ఈశ్వరుడి ప్రీతి కొరకై చేసే కర్మలన్నింటికి సత్ అనే చెబుతారు.

శ్రద్ధలేని హెూమం, ధ్యానం, తపస్సు, కర్మలు అసత్ అంటారు. వాటివల్ల ఇహలోకంలోగాని పరలోకంలో కాని ఫలితం ఏమి ఉండదు.

మోక్ష సన్యాసం

ఫలాన్ని ఆశించి చేసే కర్మలను విడిచిపెట్టడం సన్యాసం. త్యాగం మూడు విధాలు. సమస్థ కర్మల ఫలితాలను వదిలిపెట్టడం సాత్విక త్యాగం. యజ్ఞం, ధ్యానం, తపస్సు అనే కర్మలను ఫలాపేక్ష రహితంగా జరిపితే చిత్తశుద్ధి చేకూరుతుంది. కర్తవ్య బుద్ధిని, ఆశక్తిని, ఫలాన్ని విడిచిపెట్టి ఆచరించడం సాత్విక త్యాగం. కర్మలను వదలకుండా కర్మ ఫలాలను విడిచిపెట్టిన వాడు త్యాగి (18.11).

స్వధర్మాను సారంగా నిత్యం ఆచరించవలసిన కర్మలను విడిచి పెట్టడం మంచిదికాదు. అవివేకంతో చేసే అలాంటి త్యాగాన్ని తామస త్యాగం అంటారు (18.7).

శరీర శ్రమను తప్పించుకునేందుకు భయంతో నిత్యకర్మలను విడిచిపెట్టడం రాజస త్యాగం అవతుంది. అలాంటి త్యాగం చేసినవాడు త్యాగ ఫలం పొందలేడు (18.8,9).

మానవుడు మంచిని చెడ్డను ఆరంభించడానికి కారణాలు శరీరం, జీవాత్మ, ఇంద్రియాల వ్యాపారాలు, దైవం (18.1). బుద్ధి, సంస్కారంలేని కర్త ఈ కారణాలను వదిలి తానే కర్తనని భావిస్తాడు (18.14, 16).

కర్మల విషయంలో అహంకారం, మమకారం లేనివానికి ప్రాణు లన్నింటిని చంపినా హంతకుడు కాడు. కర్మలు అతన్ని బధించవు.

మొదట అమృత తుల్యంగా ఉండి చివరకు విషంగా మారే సుఖం ఇంద్రియాల కలయిక వల్ల కలుగుతుంది. "బాగా ఆచరింపబడ్డ ఇతరుల ధర్మం కంటే గుణం లేనిదనిపించిన తన ధర్మమే మంచిది. తన ధర్మాన్ని తాను నిర్వర్తించేవానికి పాపం అంటదు" (18.45).

పరిశుద్ధమైన బుద్ధి కలది, ధైర్యంతో మనసును వశపరచుకొని, శబ్దాది విషయాలు, రాగ ద్వేషాలను విడిచిపెట్టి ఏకాంత వాసం చేస్తూ, మితంగా తింటూ, మాటలు, శరీరం మనసులను అదుపులో పెట్టుకొని, నిరంతరం ధ్యాన యోగంలో వుంటూ, వైరాగ్యాన్ని ఆశ్రయించి, అహంకారం, బలం, గర్వం, కామం, క్రోధం, వస్తు సేకరణలను వదలి పెట్టి, మమకారం లేకుండా శాంత స్వభావం కలిగినవాడు బ్రహ్మ స్వరూపం పొందడానికి అర్హుడు (18, 52, 53).

ముగింపు

నిత్యజీవితంలో అన్ని కార్యక్రమాలు, సమస్యలు ఇంద్రియాల ప్రమేయం వలననే కలుగతాయి. అందువలన, ఇంద్రియ వినియోగం, ఇంద్రియ నిగ్రహం మీద దృష్టి ఉంచి, వ్యక్తి పురోగతికి సమాజ అభివృద్ధికి ప్రయత్నించడం, పురుష ప్రయత్నాన్ని సద్వినియోగం చేయడం అవుతుంది. పై పెచ్చు పురుషార్థాలను అనగా అర్ధ కామాలను, ధర్మంతో ముడివేసి, మోక్షాన్ని అనగా ఆత్మానందాన్ని అనుభవించడానికి అర్హతను సంపాదించుకోవడం, సులభం అవుతుంది. జ్ఞానంతో ఇంద్రియాలను నిగ్రహించడం, తద్వారా బ్రహ్మములో రమించడం ఒక యుద్ధం. ఒక యజ్ఞం. ఒక యోగం.

యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః ।
తత్ర శ్రీ ర్విజయో భూతిః ధ్రువానీతి ర్మతిర్మమ ॥ (18-78)

(యోగీశ్వరుడైన శ్రీకృష్ణభగవానుడు, ధనుస్సు ధరించిన అర్జునుడు ఉండేచోట సంపద, విజయం, ఐశ్వర్యం, నీతి, నిలకడగా ఉంటాయని నా విశ్వాసం.)

హరిః ఓం తత్సత్

గీతా సూత్రాలు

1. కోరికలను అదుపులో వుంచుకోవడం.
2. అభయాన్ని అభ్యాసం చేసుకోవడం.
3. దుఃఖించతగని దానిని గురించి దుఃఖించడాన్ని విసర్జించడం.
4. మంచిని పెంచుకునే జ్ఞానాన్ని కూడబెట్టడం.
5. ఉత్తమమైన కర్మలను ఆచరించడం.
6. నిష్కామకర్మను ఆచరించడంలో ఆనందాన్ని పొందడం.
7. కర్మను ఆచరించడంలో కర్తృత్వ భావాన్ని వదలడం.
8. కర్మఫలాన్ని త్యజించే వైరాగ్యాన్ని అభ్యాసం చేయడం.
9. లౌకికమైన విషయాలనుండి మనస్సును ధ్యాన సమాధిలో నిలపడం.
10. నశించని అక్షర పరబ్రహ్మాన్ని చేరకలిగే సాధన చేయడం.
11. భగవంతుని చైతన్యాన్ని దర్శించే కృషిని సల్పడం.
12. నిరాకార భక్తి మార్గాన్ని అనుసరించడం.
13. మనస్సును రాగాన్నుండి మరలించే ప్రయత్నం చేయడం.
14. గుణత్రయాలకు అతీతంగా కర్మ జ్ఞానాలను మలచుకోవడం.
15. గుణాతీతుడైన పురుషోత్తముని దర్శించే ప్రయత్నం చేయడం.
16. అసుర సంపదను దూరంచేసి దైవీసంపదను పెంచుకునే ప్రయత్నం చేయడం.
17. కర్మ జ్ఞానాలతో 'నేను', 'నాది' అన్న భావాన్ని విస్మరించడం.
18. శుద్ధచైతన్యంగా మిగిలిపోవడానికి కర్మ భక్తి జ్ఞానాలను సంధించి యుద్ధం చేయడం.

యోగశాస్త్ర సారాంశం

1. భయ విషాదాలను భగవంతునికి వెలిబుచ్చడం విషాదయోగం.
2. జ్ఞానంలో సంశయాన్ని, విషాదాన్ని విచ్ఛేదం చేయడం సాంఖ్య యోగం.
3. వాసనలను ఉత్తమమైన కర్మలలో లయం చేయడం కర్మ యోగం.
4. కర్మను నిష్కామంతో జ్ఞానంలో లయం చేయడం జ్ఞాన కర్మ సన్యాస యోగం.
5. కర్మను ఆచరించడంలో కర్తృత్వ భావాన్ని త్యజించడం కర్మ సన్యాస యోగం.
6. కర్మ ఫలాన్ని కర్తృత్వాన్ని త్యజించి కర్మ సన్యాసాన్ని స్వీకరించి మనస్సును భక్తితో ముడివేయడం ఆత్మ సంయమ యోగం.
7. జ్ఞాన విజ్ఞాన అధిదైవత్వంతో, అధి యజ్ఞంతో విడివడి పరమశ్రేష్ఠమైన బ్రహ్మమును తెలుసుకోవడం జ్ఞాన విజ్ఞాన యోగం.
8. అపర సృష్టి పరాప్రకృతిలో లయంకాగా నశించని అక్షరపరబ్రహ్మాన్ని చేరుకోవడం అక్షరపరబ్రహ్మ యోగం.
9. అవ్యక్తం నుండి వ్యక్తమౌతున్న ప్రపంచాన్ని దాని రహస్యాన్ని తెలుసుకొని వ్యవహరించడం రాజవిద్యా రాజ గుహ్య యోగం.
10. సృష్టి స్థితి లయల బ్రహ్మాండం విభూతిని గోచరం చేసుకోవడం విభూతి యోగం.
11. సాకారమునుండి నిరాకారానికి నడిపించే భక్తిమార్గాన్ని అనుసరించడం భక్తి యోగం.
12. రాగానికి లోబడిన మనస్సు, పరిశీలించే బుద్ధి ద్వారా ఆది మద్యాంత రహితమైన జీవబ్రహ్మైక్య అనుభూతి క్షేత్ర క్షేత్రజ్ఞ యోగం.

13. కార్యకారణ సంబంధంతో ముడివడిన గుణత్రయాల వికారాలను దాటగలగడం యోగం.
14. త్రిగుణాత్మకమైన మాయ నుండి అధిభూతంలో వేయడం యోగం.
15. త్రిగుణాలకు లోబడే పురుషుడు గుణాల క్షర అక్షరమునకు అతీతుడైన పురుషోత్తముడిని దర్శించడం పురుషోత్తమ ప్రాప్తి యోగం.
16. కారణ శరీరంతో అసుర సంపదను దూరంచేసుకొని దైవసంపదను దగ్గర చేర్చుకొని జీవుడికి భగవంతుడికి మధ్యవున్న తెరను తొలగించడం దైవాసుర సంపద్విభాగయోగం.
17. శ్రద్ధతో 'నేను' అన్న భావాన్ని తొలగించి దానికి ఆధారమైన పరమాత్మ భావాన్ని స్వానుభవానికి తెచ్చుకొని అనాయాసంగా తరించడం శ్రద్ధాత్రయ విభాగయోగం.
18. పరిమితులకు ఆధారమైన అహంకారాన్ని తొలగించుకొని అనంతమైన పరమాత్మ స్వరూపంలో లయమై సచ్చిదానంద స్వరూపుడై పరబ్రహ్మంగా శుద్ధచైతన్యంగా మిగిలిపోవడం మోక్షసన్యాస యోగం.

వ్యక్తిత్వ వికాసానికి, ప్రేరణకు భగవద్గీత లోని శ్లోకములు

ఏ వ్యక్తికైనా ప్రేరణ ముఖ్యం. ప్రేరణ వలన తాను చేయబోయే పని మీద ఇష్టం, శ్రద్ధ ఏర్పడుతాయి. ఇష్టమైన పనిని చేయడంలో కష్టం లేకపోవడమే కాక తృప్తి ఆనందం కలుగుతాయి.

వ్యక్తిత్వ వికాసం కార్యమైతే, ప్రేరణ కారణమవుతుంది. ఈ విషయాన్ని గీతలో విశదీకరించనంతగా ఇతర గ్రంథాలలో ప్రత్యేకంగా కనబడదు.

ప్రేరణకు రుజువు, ఒక వ్యక్తి తనకు అయిష్టమైన దానిని ఇష్టంతో చేయడానికి కార్యోన్ముఖునిగా చేయడం. అర్జునుడు యుద్ధ భూమి నుండి అయిష్టంతో వెనుతిరిగి వెళ్లడానికి నిశ్చయించుకున్నప్పుడు శ్రీకృష్ణుడు కలిగించిన ప్రేరణ భగవద్గీత సారాంశం. పైపెచ్చు మానవుడు వ్యక్తిగా తాను చేయువలసిన కర్మలు సంపాదించుకొనవలసిన జ్ఞానం, చూపించవలసిన భక్తి, ఆచరించవలసిన విధివిధానాలు ప్రతి వ్యక్తికి (పర్సన్) ఒక విశిష్ట వ్యక్తిత్వాన్ని (పర్సనాలిటీ) కల్గించేందుకు చేసిన ప్రయత్నమే గీత యొక్క ముఖ్యఉద్దేశం. అయితే ఇది అర్జునునికి వ్యక్తిత్వం లేదని దానిని తీర్చుదిద్దడానికి చేసిన ప్రయత్నమని అనుకుంటే వ్యక్తులుగా మనందరం వ్యక్తిత్వానికి అర్హతను పోగొట్టుకున్న వాళ్లమవుతాం.

గీతా సందేశం నాకోసం, మీ కోసం, మనందరి కోసం. ఎవరికైతే ప్రేరణ, వ్యక్తిత్వ వికాశం కావాలనుకుంటరో వాళ్లందరికోసం. వ్యక్తిత్వ వికాసానికి కర్తవ్య నిర్వహణకు ఉపయోగపడే కొన్ని శ్లోకాలను యువ తరానికి ఉపయోగపడుతాయని ఉద్దేశంతో ఈ క్రింద పొందుపరుస్తున్నాం.

1. అశోచ్యా నన్వశోచస్త్వం (2.11).

దుఃఖింప తగని వారిని గూర్చి దుఃఖించుట పనికిరాదు.

2. గతాసూ నగతా సూంశ్చ నానుశోచంతి పండితాః (2.11).

జ్ఞానవంతులు మృతినొందిన వారిని గూర్చి కాని బ్రతికి వున్న వారిని గూర్చి వగవరు.

3. అంత వంత ఇమే దేహా (2.18).

ఏ దేహములను నీవు నిత్యములని, శాశ్వతములని అనుకుని చున్నావో అవి అనిత్యములు, అ శాశ్వతములు.

4. స్వధర్మ మపి చావేక్ష్య న వికంపితు మర్హసి (2.31).

నీ ధర్మాన్ని తెలుసుకొని నీవు భయపడవద్దు. స్వధర్మం సర్వశ్రేష్ఠం.

5. తస్మాదుత్తిష్ఠ కౌన్తేయ! యుద్ధాయ కృతనిశ్చయః (2.37).

కృతనిశ్చయంతో యుద్ధానికి నడుం బిగించు.

6. సుఖదుఃఖే సమే కృత్వా లాభాలాభౌ జయాజయౌ (2.38).

సుఖదుఃఖాలు, లాభనష్టాలు, జయాపజయాలు సమానంగా భావించి స్థితప్రజ్ఞత్వంతో సమరం సాగించు.

7. వ్యవసాయాత్మికా బుద్ధిః ఏకేహా (2.41).

నిశ్చయాత్మకమైన బుద్ధి ఒకే విధంగా ఉంటుంది. స్థిరసంకల్పం లేని వాళ్ల ఆలోచనలు పరిపరి విధాలా పరుగెడుతాయి.

8. కర్మణ్యే వాధికార స్తే మా ఫలేషు కదాచన (2.47).

కర్మలు చేయడం వరకే నీకు అధికారం. కర్మఫలంతో నీకు సంబంధం లేదు.

9. యోగః కర్మ సుకౌశలం (2.50).

ప్రతి పనిని నిదాముగా ఆలోచించు, కార్య సాఫల్యానికి నిపుణుంగా ప్రయత్నించు. కౌశలంతో కర్మలు చేయడం 'యోగం'.

10. ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థితప్రజ్ఞస్తదోచ్యతే(2.55).

ఎప్పుడు ఆత్మానందము అనుభవించేవాడు స్థితప్రజ్ఞుడు.

11. అశాంతస్య కుతస్సుఖం (2.66).

మిన్ను విరిగి మీద పడినా ఆవేదన చెందరాదు. కష్టములన్ని ఒక్కసారి చుట్టుముట్టినా ప్రశాంతంగా ఉండడం అలవాటు చేసుకోవాలి. మనశ్శాంతి లేని వాడికి సుఖం శూన్యం. 'శాంతము లేక సౌఖ్యము లేదు'.

12. య స్త్విన్ద్రియాణి మనసా నియమ్యారభతేర్జున।
కర్మేన్ద్రియైః కర్మయోగం అసక్తస్స విశిష్యతే॥ (3.7).

మనసుతో జ్ఞానేంద్రియాలను స్వాధీనంలో ఉంచుకుని నిష్కామకర్మ చేయువాడు ఉత్తముడు.

13. నియతం కురు కర్మత్వం (3.8).

నీవు సోమరిపోతు కారాదు.నీకు విధించిన పనిని కర్తవ్య నిష్టత చేయి.

14. లోకసంగ్రహమేవాపి సంపశ్యన్ కర్తు మర్హసి (3.20).

లోకక్షేమం కోసం నీవు సత్కర్మలు చేయాలి.

15. యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవేతరో జనః।
సయత్ప్రమాణం కురుతే లోక స్తదనువర్తతే॥ (3.21).

శ్రేష్ఠుడైన పురుషుని ఆచరణమును ఇతరులు కూడా అనుసరింతురు. అతడు నిల్పిన ప్రమాణములను లోకులందరు పాటించెదరు. నీవు కూడా ప్రమాణములను నిలిపి వాటిని పాటించుము.

16. జహిశత్రుం మహాబాహో కామరూపం దురాసదం (3.43).

నీవు ఆశ అనే మహాశత్రువుని జయించు, లేనిచో దురాశకు లోనై జీవితాన్ని నాశనం చేసుకొనెదవు.

17. యదృచ్ఛా లాభ సన్తుష్టోః (4.22).

సంతృప్తి మానవునికి ఆనంద హేతువు. అసంతృప్తి విషాద హేతువు. లేని దానికై పరిగెత్తి జారిపడక, ఉన్నదానితో సంతృప్తిని పొందవలెను.

సంతృప్తుడు మూడు జగములకు పూజనీయుడు. సంతోషికే సుఖం కలుగుతుంది.

18. శ్రద్ధావాన్ లభతే జ్ఞానం (4.39).

గురువులను, పెద్దలను, శాస్త్రములను, అశ్రద్ధ చేయకూడదు. అశ్రద్ధ అజ్ఞానమునకు నిలయం. అజ్ఞాని సుఖించలేడు. అజ్ఞానాందకారము నుంచి బయలుపడి విజ్ఞాన తేజస్సును నలు దిశలా విరజిమ్మి జీవన్ముక్తుడు కావాలంటే శ్రద్ధతో జ్ఞానమును పొందవలెను. శ్రద్ధ గలవానికి మాత్రమే జ్ఞానం లభిస్తుంది.

19. సుహృదం సర్వభూతానాం:(5.29).

మనస్సును విప్పి మాట్లాడుకునే స్నేహితుని సుహృత్తం అని అంటారు. అట్టి సుహృత్తు సర్వులకు భగవంతుడే. మనస్సు విప్పి నీ సంగతి ఆ దయామయునికే విప్పి చెప్పు.

20. ఉద్ధరే దాత్మనాత్మానం నాత్మాన మవసాధయేత్
ఆత్మైవ హ్యాత్మనో బంధుఃఆత్మైవ రిపు రాత్మనః (6.5).

మనుజులు తమను తామే ఉద్ధరించుకొనవలెను. తమకు తామే ఆధోగతి పాలు కాకూడదు. తన మనస్సే తనుకు బంధువు. తన మనస్సే తనకు శత్రువు.

21. సమలోష్టాశ్మ కాంచన: (6.8).

అన్ని వస్తువులను సమానంగా చూడు. ఎక్కువ తక్కువలు పెట్టుకోరాదు. అవి మమకార బంధాన్ని కలిగించి పతనానికి నాంది పలుకుతాయి. మట్టి, రాయి, బంగారం ఈ మూడింటిని సమానంగా చూడు. అప్పుడే హాయిని పొందగలవు.

22. నహి కల్యాణ కృత్కశ్చిత్ దుర్గతిం తాతగచ్ఛతి (6.40).

మంచి పని చేసిన మానవుడు ఎన్నడూ దుర్గతిని పొందడు.

23. మత్తః పరతరం నాన్యత్కించిదఃస్తి ధనంజయ (7.7).

భగవానునికంటే వేరైనది మరేదీ లేదు.

24. జ్ఞానీత్వాత్మైవమేమతం(7.18).

శాశ్వతానందమే దైవమనే భావన పొందిన వారు జ్ఞానులు. అట్టి జ్ఞానవంతుడైన భక్తునికి భగవానునికి తేడా లేదు. ఇరువురు ఒక్కటే.

25. అద్వేష్టా సర్వభూతానాం (12.13).

ఎవ్వరినీ ద్వేషించకు. అందరినీ సమానంగా చూడుము. సర్వభూతాలను ఆవరించి ఉన్నది నేనే కావును ఇతరులను ద్వేషించుట నిన్ను నీవు ద్వేషించుట అని తెలుసుకో.

26. ఇంద్రియార్థేషు వైరాగ్యం (13.9).

ఇంద్రియలోలుడు కావద్దు. వారిని సంతోషపరుచుట సాధ్యం కాని పని. ఇంద్రియాలను స్వాధీనం చేసుకోవాలంటే విషయ విముఖతను పెంచుకో.

27. ప్రకృతిం పురుషం చైవ విద్ధ్యనాదీ ఉభావపి (13.20).

ప్రకృతి పురుషులు రెండూ అనాధియని తెలుసుకొనవలెను.

28. దైవీసంపద్విమోక్షాయ నిబంధాయాసురీమతా:(16.5).

అసుర సంపద బంధము, దైవీ సంపద మోక్షము కలుగును.

29. యజ్ఞ దాన తపఃకర్మ నత్యాజ్యం కార్యమేవ తత్ (18.5).

యజ్ఞం, దానం, తపస్సు అనెడి మూడు కర్మలను ఎన్నడూ విడువతగదు.

30. స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విందతి మానవః (18.46).

మనుజుడు స్వకర్మతో భగవంతునిని అర్చించి మోక్షమును పొందును.

శుభం భూయాత్!

సర్వేజనా సుఖినోభవన్తు!!

ఓం!!! తత్సత్!!

KRISHNAM VANDE JAGADGURUM



SRI KRISHNA

KRISHNA is a marvel in the entire human history and mythology, either as an allegory or a reality. He is a darling of humanity. He is a liberator, saviour and rescuer. He is an epitome of love and compassion. He is a multi-faceted and multi-purpose character inspiring all human activities combining with divine spirit. In the rituals of Krishna we can find mythology and philosophy. In the mythology of Krishna we can find rituals and philosophy. In the philosophy of Krishna we can find mythology and rituals. All great events of all ancient and modern heroes or Avatars or God-men or Messiahs and Prophets are part and parcel of Krishna's life and preaching.

KRISHNA AVATAR

Krishna belongs to heroic school both in history and mythology (History+ Religion). He is both a man of action and a history creator. The great legacy left by Krishna on the sands of time in terms of His foot prints, Finger prints, Hand prints, Head prints and Heart prints has no match with any Religious or Puranic or Historical figure. He directed the destinies of contemporary as well as future generations in every walk of life by combining art and heart, thought and action and word and deed. Lord Krishna is an integrated, illimitable and unparalleled Hero with many-sided knowledge and practice.

He had many youthful deeds of daring battles with dangerous birds, monstrous beasts, and poisonous reptiles, vicious horses, mad bulls, ferocious vultures, powerful pythons and snakes, But He loved the nature and animals. He loved cows, horses, birds and other

creatures. Krishna protected his fellow-cow keeper boys and their flocks and herds from violent thunders and storms for many days using Govardhan hill as an umbrella. Krishna danced triumphantly on the five heads of Kaaliya serpent, dragged and drowned the snake which had been poisoning the waters of Yamuna frequently.

Krishna incarnated on this earth to reestablish the polluted Dharma and to teach humanbeings to discharge their lawful duties to one another. Krishna is the super hero, the matchless warrior, the breaker of the militarist rule of the people, the expeller of Rakshasas, the unrivalled statesman, the great strategist, the maker and consolidator of Dharma Raja Empire. He is the maker of the vast and beautiful city Dwaraka on the sea shore. He experimented the republicanism. Above all He is the Teacher of the Gita, preaching the need of Karma, Bhakti and Jnana Yogas to know and understand His conception and practice of "*fullness of life*" in terms of heights and depth of the soul, the trials and tragedies of life through philosophy, mythology and ritualism in their true spirit. Fullness of life of Krishna includes not only grace, but serious struggle against ills and evils.

Krishna's life as a babe, a boy, a youth, an adult, a scholar, a super physical being is charming, fascinating, maddening, inspiring and beautiful. He as hero of heroes, aesthete of aesthetes, teacher of teachers is grand and marvelous in every respect adding immense value to the society at large with no parallel.

Krishna has glorified every human relationship viz., husband, wife, father, mother, daughter, son, brother, sister, uncle, aunt,

grandfather, grandmother in every kind and degree of His kinsmen, relatives, friends, masters and servants.

Krishna's role in this mundane world is the role of a loving mother, affectionate father, darling child, dutiful husband, wise mentor and a patriotic citizen avoiding all excessiveness.

PREACHINGS

KRISHNA'S preaching in Gita is useful to deform and reform people and worldly processes. He said, that He Persists as a Substratum in all animate and inanimate things which undergo change constantly. But He remains changeless (XIII. 28). To elaborate this He further said that, He is the Way (Gita IV.II and IX.I8), He is the Truth (X.14), He is the Life (VII.9). He is seated in the heart of everybody (IX.18) who worships Him doing unselfish acts of service to suffering humanity as His Instrument and a Sacrifice to Him (XVII, 65 and XI.33), and He counsels to leave everything and surrender to Him to relieve devotees from their sins and gain liberation (VIII, 14 and IX .22).

He taught in the Gita about, the lower self and the higher self, the lower nature and the higher nature, the lower spirit and the higher spirit (Purushothama) in the worldly and the divine facets. It has the substance of methodology to reconcile the disorders and wiping out wrong to establish right in life.

KRIHNA AS A HUMAN AND SUPER HUMAN

Krishna's physical power, beauty, grandeur, mental caliber, love, compassion, sympathy and empathy should be the role model to the youth of India. It has survival, speculative, security, sentiment

and spiritual dimension of human life in relation to the rest of the world. Many great souls including Vyasa, Narada and Kanva, Bhishma and Drona, Gandhari and Kunti extolled about Krishna as

"***Where there is dharma there is victory, where there is Krishna there is victory.***

- Krishna is an eternal boy playing an eternal game in an eternal garden.
- Krishna is a perfect yogi with precept and practice.
- Krishna is the first master of all fine arts.
- Krishna has a rare combination of a beautiful body and a wise mind.
- Krishna has a marvelous and aesthetic taste.
- Krishna is a master of sixty four fine and other arts.
- Krishna fascinated the village maids, youths and cattle by playing His flute.
- Krishna gave training to Naradha to learn Veena.
- Krishna served like any other disciple under the tutelage of Acharya Sandipani.
- Krishna gave Guru Dhakshina by bringing back life to his son from Panchajanya.
- Krishna is a great Politician, Political thinker, Strategist, Yuga karaka, Yuga Preritha and Yuga Pravarthaka.
- Krishna struugled to establish unity.
- Krishna preached to develop *Sattwic* nature.

- Krishna is a Reconciler, Mediator, Ambassador, Mother, Father, Parent, Acharya and Protector.

- Krishna is divine in beautiful human form with splendid complexion and colour.

- Krishna is both a purana figure and historical figure combining both romance and logic.

- Krishna Avatar is not an accidental incident , but His advent is purposeful.

- Krishna appeared for special reasons and purposes in special circumstances.

- Krishna taught the science of Infinite spirit (Brahma Vidya), a science of the self (Atma vidya) to the humanity.

MANY-SIDED LIFE OF KRISHNA

Krishna's life is the ***"truth of all truths".***

Krishna's life is instructive and sweet for all people irrespective of their age.

Krishna's life is meant for motivating people to work with devotion, dedication and detachment.

Krishna's life is the paragon of justice and equitability.

Krishna's life is to teach rights and duties of individuals and social classes

Krishna's life is to spiritualize the politics, civics and economics.

Krishna's life is to synthesize the individualism and socialism, capitalism and communism, democracy and dictatorship.

Krishna's life is to preach not exclusiveness but synthesis, "not this alone but this also."

Krishna's life is to attract from different sources clinging by love, by fear, by hate, by kins-manship, by deep friendship, by whole hearted devotion.

Krishna's life is to inspire violent dislikes as well as ardent likes.

Krishna's life is to protect the dependents on Him.

Krishna's life is a combination of management of winning His wives, sons, brother, enemies, friends with love, patience and positive means on one side and preaching to fight against the men of evil on the other.

KRISHNA
A ROLE MODEL FOR ALL

Every child and adult alike should read, hear, understand, imitate, emulate and try to be like the childhood, disciple hood, parenthood, political hood, administrative hood, ruler hood, reconciler hood, promoter hood, developer hood, sustainer hood of Krishna and thereby develop an exemplary personality. Read more and more to know and meditate about Krishna, the Jagadguru and the role model to the World, for a happy life here and salvation here after.

To develop one's own personality an individual needs no book, no trainer and no teacher, if he/she can learn life and philosophy and practice of Lord Sri Krishna.

PRAYER

O Krishna!

Salutation to You.
You're the father of all men
You're the husband of all women
(A natural corollary of the first)
You're the babe of all parents
You are omnipresent,
omniscient and omnipotent
You are the Time, Space and Energy
You pass the breathe to the men of
this world through your flute
You brush the sorrow from the
hearts of the people
You have instituted Diwali by
killing Narakasura.
You have killed Kamsa.
You have become
Murari by vanquishing
Mura and his brigade of
70,000 demons. You inspired
Pingala to leave off
her shameful profession.
You brought Parijatha to Dwaraka
You cured the hunchback of Kubja
You came to wind up the Dwapara age.
You bid to death the ogress Puthana.

You epitomized the friendship through Arjuna and Kuchela.
You demonstrated the ills of lust, hate, greed,
pride and ego of sinful.
You married eight wives by
selecting carefully and winning
them by great feat of strength and courage and
1601 rescued-maids
at their request for reasons of political, social,
commercial and marital
You wiped out the evil by creating the wars
among brothers in Kurukshetra
You established purity by creating quarrels among
your kith and kin slaughtering
each other in Dwaraka.

O Krishna!

You Supreme Soul!
I bow and offer my salutations to you
I echo your name not only with my tongue but with my entirety!
I am your servant and slave!
I wash your feet with my tears!
You save me from my sinful thoughts, emotions and actions.
You Supreme Soul!
You save me from the terrible snare
of life imprisonment.



Acharya Seshaiah Kandamuru, M.Com., Ph.D. is a retired Professor of Commerce and Management of Sri Venkateswara University, Tirupati. Primarily, he is a teacher at heart apart from being an administrator, researcher, consultant, trainer and a mentor. He was the Founder Secretary of Bharatiya Vidya Bhavan, Tirupati Kendra School and Ex-Honorary Director of Andhra Pradesh Productivity Council, Tirupati.

He has organized thousands of programmes covering Leadership, Motivation, Communication, Organizational Behavior (OB) and Entrepreneurial Development including PMRY and CMEY. His mission is to convert problematic and lethargic children into successful career oriented people. He is a recipient of "*Pratibha Puraskar*", "Best Citizens of India" "Vijnana Vidvanmani" and "*Siksha Ratna*". His mission is to solve the real and notional problems of people. He mentors parents, children, men and women of all ages and positions to come out of their utopian thinking that damages their health, wealth and relationships. He authored articles and books on Banking, Commerce, Children's Stories, "21 Leadership Lessons" (Co-authored),"Fate & Free-Will: The Philosophy of Fate and the Science of Free Will", "Leadership Proverbs", "Communication Skills", "Personality Development", "Mentor to Leader", "Sri Sreenivas Charitam" (Telugu Lyrics), "Krishna", "పూర్ణిమ" (నవల) and "Bala Kadha Sudha" and Brahmana Chaitanyam (Telugu).

"తరాల అంతరం" (నవల), "The Work Culture in Bhagavad Gita", "Lokagnanam", "The Physics of Philosophy" and "The Philosophy of Physics" are under print.